VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
AAERI QEAC No. E334
www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 149, పేజీలు - 08
శుక్రవారం, నవంబర్ 7, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## జూబ్లీహిల్స్‌లో బలగాలని దించండి

**- ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు కలిసి అల్లర్లు సృష్టించి రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉన్నందున కేంద్ర బలగాలను దించాలని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఢిల్లీలోని సీఈసీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు ఫిర్యాదు చేశారు. తెలంగాణలో హెూంమంత్రిత్వ శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నందున, పోలీసులు ఎన్నికలలో పారదర్శకంగా వ్యవహరిస్తారనే నమ్మకం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కూడా సీఈసీకి ఫిర్యాదు చేసింది. పోలింగ్ రోజున మజ్లిస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు అధికార పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం ఓట్ల రిగ్గింగ్, దొంగ ఓట్లకు పాల్పడే అవకాశం ఉందని ఫిర్యాదులో

2లో..

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. ఓటర్లకూ ఓ పరీక్ష..!

**- ఓటర్లను ఖాఖా పడుతున్న ప్రధాన పార్టీలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జూబ్లీహిల్ ఉప ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రచార జోరు పెంచాయి. నవంబర్ 11న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సిట్టింగ్ స్థానం నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ప్రచారంలో వినూత్న పద్ధతులు అవలంబిస్తోంది. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ల ద్వారా కేటీఆర్ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల మధ్య ఎండగడుతున్నారు. ఇక అధికార కాంగ్రెస్ ఇక్కడ గెలిచి హైదరాబాద్‌పై పట్టు సాధించాలని భావిస్తోంది. ఇక బీజేపీ కూడా తర్వాత అధికారం తమదే అని నిరూపిచాలంటే జూబ్లీహిల్స్ గెలవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఈ ఎన్నికలు ఇక్కడి ఓటర్లకు కూడా ఓపరీక్షగా మారాయి. జూబ్లీహిల్స్ రెండు సార్లు విజయాన్ని అందుకున్న బీఆర్ఎస్ ఈసారి ప్రజలకు చేసిన అభివృద్ధి పనుల జాబితాను చూపిస్తూ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఉంది. రహదారులు, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, ప్రజా సేవల విస్తరణ అనే అంశాలను ప్రధానంగా ప్రచారంలో వినిపిస్తోంది. పేదలకు అండగా, ధనికులకు సౌకర్యాలుగా రెండు వర్గాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పుకుంటోంది.

**- ప్రతిపక్షాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ ప్రచారం**

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, జూబ్లీహిల్స్‌లో మాత్రం ప్రత్యక్ష పనుల కంటే విమర్శలపై దృష్టి పెట్టింది. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి లేకుండా పోయిందని చెబుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయాలని చూస్తోంది. గెలిస్తే పనులు చేస్తామని నమ్మకం కల్పించే ప్రయత్నంలో ఉంది. కానీ ఇప్పటిదాకా చేసిన పనుల జాబితా లేకపోవడం ఓటర్లలో చర్చనీయాంశమవుతోంది.

**- జాతీయ బలంపై బీజేపీ ప్రచారం**

బీజేపీ జూబ్లీహిల్స్‌ను తెలంగాణలో ఎదుగుదలకు ప్రారంభ వేదికగా చూస్తోంది. "దేశవ్యాప్తంగా మేము పాలిస్తున్నాం, తెలంగాణలో కూడా ఎదగాలంటే ఈ సీటు అవసరం" అనే నినాదంతో ప్రచారం చేస్తోంది. స్థానిక అభ్యర్థి కన్నా పార్టీ బ్రాండ్ ప్రభావంపై ఆధారపడుతున్న వ్యూహం స్పష్టంగా కనిపిస్తుంది.

**- అభివృద్ధికా, అవకాశానికా.?**

ఓటర్ల ముందున్న ప్రధాన ప్రశ్న - బీఆర్ఎస్ గతంలో చెప్పిన అభివృద్ధి నిజమా, కాదా.? కాంగ్రెస్ అధికార పార్టీగా ఉన్నందున నిధుల ప్రాధాన్యం దృష్టిలో ఉంచి ఓటు వేస్తారా? లేక జాతీయ స్థాయిలో ఉన్న బీజేపీకి స్థానికంగా అవకాశమివ్వాలా.? అనే మూడు కోణాలు ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల గమ్యాన్ని నిర్ణయిస్తాయి. జూబ్లీహిల్స్ ఓటర్ ధోరణి నగరంలో రాబోయే ఎన్నికల దిశను సూచిస్తుంది. రాజకీయ పార్టీలు వాగ్దానాల సుదీర్ఘ జాబితా కంటే ప్రజలు చూసిన అభివద్ధినే తూకం వేస్తేనే ఈ పోరు ప్రజాస్వామ్య శక్తిని సార్థకం చేస్తుంది.

## బీహార్ లో తొలిదశ పోలింగ్ పూర్తి

**- 60.13 శాతం పోలింగ్ నమోదు**



పాట్నా (ప్రశ్న న్యూస్) బిహార్ లో తొలిదశ పోలింగ్ పూర్తయింది. 18 జిల్లాల్లోని 121 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు అధికారులు. సాయంత్రం 5 గంటల వరకు బిహార్ లో 60.13 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. అత్యధికంగా బెగుసరాయ్ నియోజకవర్గంలో 67.32 శాతం పోలింగ్ నమోదైంది. బిహార్ లో అగ్రనాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో సీఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ, ఆర్జేడీ పార్టీ లాలూ యాదవ్, తేజస్వి యాదవ్, ఎల్జేపీ నేత చిరాగ్ పాశ్వాన్ తదితరులు ఉన్నారు. సీఎం నితీశ్ కుమార్ భక్తియార్ పూర్ లో ఓటువేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అయితే సేఫ్టీ దృష్ట్యా 5 నియోజకవర్గాల్లో 5 గంటలకే పోలింగ్ పూర్తయింది. అయితే బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హాకు చేదు అనుభవం ఎదురైంది.

2లో..

# గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకోవాలి

**- డేటా ఆధారిత పాలనపై సీఎం చంద్రబాబు సదస్సు**

- ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని సూచన
- సదస్సుకు హాజరైన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలు
- వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరైన జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

2లో..




## రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి ఎలా వస్తారు.?

**- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత రెండేళ్లుగా అసెంబ్లీకే రాని కేసీఆర్ రాబోయే మూడేళ్ల తర్వాత అధికారంలోకి ఎలా వస్తారని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ నగర అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఈరోజు లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇక్కడ పని చేస్తున్నారంటే

2లో..

# నిర్లక్ష్యం లేకుండా కలిసికట్టుగా పని చేయాలి

- పార్టీ ముఖ్య నాయకులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి
- ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని సూచన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు

2లో..

# మీరు ఎవరిని డిసైడ్ చేస్తే వారే అధికారంలోకి వస్తారు

**- జగన్ కీలక నిర్ణయం**



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు చేసారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం దిశగా వ్యూహాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా అనుబంధ సంఘాల నేతలకు కీలక బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఇక నుంచి తాను కార్యకర్తలతో మమేకవ్వాలని జగన్ నిర్ణయించారు. ఇందు కోసం త్వరలోనే సమావేశాలు ఉంటాయని వెల్లడించారు. అదే సమయంలో చంద్రబాబు పాలన పైన జగన్ ధ్వజమెత్తారు. ఫీజు బకాయిలు, మెడికల్ కాలేజీల విషయంలో పోరాటానికి సిద్దం కావాలని పిలుపునిచ్చారు. గుగూల్ క్రెడిట్ ను చంద్రబాబు చోరీ చేసారని జగన్ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్టూడెంట్ వింగ్ అధ్యక్షులతో జగన్ సమావేశం అయ్యారు. ఈ భేటీలో కీలక దిశా నిర్దేశం చేసారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ వాయిస్ గా మారి నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. మీరు ఎవరిని డిసైడ్ చేస్తే వారే అధికారంలోకి వస్తారని వ్యాఖ్యానించారు.

2లో..

## గెలుపెవరిదో సర్వేల్లో తేలడం లేదు

**- జూబ్లీహిల్స్ సర్వేలపై కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై సర్వేల్లోనూ స్పష్టత రావడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఓటర్లు ఎటువైపు మొగ్గ చూపుతున్నారనే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు.

2లో..

# యువతకు ఉద్యోగాల బదులు డేటా మత్తు

**- సోషల్ మీడియాను '21వ శతాబ్దపు మత్తు'గా అభివర్ణన**



పాట్నా (ప్రశ్న న్యూస్) లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ యువతకు ఉద్యోగాలు కల్పించకుండా, వారికి చౌకగా డేటా అందించి సోషల్ మీడియాకు బానిసలను చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీన్ని '21వ శతాబ్దపు మత్తు'గా ఆయన అభివర్ణించారు. గురువారం బీహార్‌లోని పూర్ణియాలో జరిగిన భారీ బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ "మీ ప్రధానమంత్రి ఇక్కడికి వచ్చి మీకు 21వ శతాబ్దపు మత్తును ఇచ్చారని చెప్పారు. గతంలో మద్యం లేదా డ్రగ్స్‌తో జరిగే పని, ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో జరుగుతోంది. యువత 24 గంటలూ రీల్స్ చూస్తూనే ఉన్నారు" అని అన్నారు. సభకు హాజరైన వారిని ఉద్దేశించి, "ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌తో మీ జేబుల్లోకి ఎంత డబ్బు వచ్చింది? మీకు ఉద్యోగాలు కావాలా? లేక ఇన్‌స్టాగ్రామ్ కావాలా?" అని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ భారత యువత ఉపాధిని లాక్కొని, దాన్ని చైనా యువతకు అప్పగించారని రాహుల్ ఆరోపించారు. "ఆయన మీ ఉపాధిని తీసివేసి చైనాకు ఇచ్చానని మీకు చెప్పరు. బీహార్ యువతను కార్మికులుగా మార్చేశారు" అని విమర్శించారు. మోదీ ప్రభుత్వంలో బీహార్ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని,

2లో..

## వరుస ప్రమాదాలపై సీఎం చంద్రబాబు ఆవేదన

**- వ్యవస్థాగత లోపాలపై కీలక వ్యాఖ్యలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన వరుస ఘోర ప్రమాదాలపై ఏపీ చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు, కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటనలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కేవలం విచారం వ్యక్తం చేయడమే కాకుండా ఈ ప్రమాదాల వెనుక ఉన్న వ్యవస్థాగత లోపాలు, పాలసీపరమైన సమస్యలను ఆయన ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా టెక్నాలజీని వాడుకోవాలని, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**- పాలసీ లోపాల వల్లే ఘోరాలు**

2లో..

# సునీతకు బిగ్ షాక్

**- మాగంటి గోపినాథ్ తల్లి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మరో నాలుగు రోజుల్లో జరగనుంది. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ తల్లి మహానందకుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. "కేటీఆర్ వల్లే నా కొడుకు గోపీనాథ్ చనిపోయాడు, సునీత పోటీపై నాకు సమాచారం లేదు. మనవడికి అన్యాయం చేయొద్దు..!" అని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మాగంటి కుటుంబ వివాదం బీఆర్ఎస్ ప్రచారానికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది.

2లో..

## ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ వ్యాఖ్యలు

**- నిర్మలా సీతారామన్‌పై బ్యాంకు యూనియన్ల తీవ్ర ఆగ్రహం**

2లో..



# జూబ్లీహిల్స్‌లో బలగాలని దించండి

ఆందోళన వ్యక్తం చేసింది. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌కు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, తక్షణమే కేంద్ర బలగాలను నియమించాలని కోరింది.

**- రేవంత్ రెడ్డిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు**

ఎన్నికల ప్రచారం సమయంలో ముస్లింలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద బీఆర్ఎస్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసింది. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, షకీల్, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బీహార్ లో తొలిదశ పోలింగ్ పూర్తి

లఖిసరాయ్ లో ఓటు హక్కు వినియోగించుకుని వెళ్తున్న ఆయన కాన్వాయ్ పై కొందరు ప్రతిపక్షనేతలు రాళ్లు రువ్వారు. చెప్పులు, ఆవు పేడ విసిరారు. అంతటితో ఆగకుండా ఓ పోలింగ్ బూత్ ను సైతం స్వాధీనం చేసుకునేందుకు ఆర్జేడీ కార్యకర్తలు ప్రయత్నించారని డిప్యూటీ సీఎం సిన్హా ఆరోపించారు. ఇక్కడ పేద, దళిత వర్గాల ప్రజలను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డపడుతున్నారని వెంటనే బలగాలను పంపించాలని స్థానిక ఎస్పీకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ అధికారంలోకి వస్తే పరిస్థితులు మరింత అధ్వానంగా మారుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి ఘటనలను ఏమాత్రం అనుమతించబోమని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఇక గురువారం జరిగిన పోలింగ్ లో రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ అలాగే ఆయన సోదరుడు జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్, డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా తదితరులు ఉన్నారు. ఇక బిహార్ లో రెండో విడత పోలింగ్ నవంబర్ 11న జరగనుంది. ఫలితాలు నవంబర్ 14 న వెల్లడి కానున్నాయి.

# గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకోవాలి

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం కూడా అదేనని ఆయన అన్నారు. అందుకు అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలని వ్యాఖ్యానించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని పిలుపునిచ్చారు. అంతా కలిసికట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫాన్‌ను సాంకేతిక వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగినట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామని అన్నారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరులను వినియోగించగలుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని అన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నెలలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

# రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి ఎలా వస్తారు.?

అందుకు పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లకు అమ్మివేసిందని ఆయన ఆరోపించారు. కేటీఆర్ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని, స్వయంగా ఆయన సోదరి కవిత ఆరోపణలు చేస్తున్నారని, వాటికి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మొదటిసారి అధికారంలోకి వచ్చి కాళేశ్వరం పేరుతో, రెండోసారి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ధరణి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుందని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉండగా దోచుకున్న సొమ్మును పంచుకునే విషయంలో విభేదాలు రావడం వల్లే ఆ కుటుంబంలో పంచాయతీ వచ్చిందని అన్నారు. వాటాల కోసం పోట్లాడుకుంటున్నారని విమర్శించారు. కేటీఆర్ సెంటిమెంట్ మాటలను నమ్మి మోసపోతే ప్రజలు ఇబ్బందిపడతారని హెచ్చరించారు. ఓటు వేసే ముందు ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులంతా కలిసికట్టుగా ఇక్కడ అభివృద్ధి చేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు.

# నిర్లక్ష్యం లేకుండా కలిసికట్టుగా పని చేయాలి

మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మరియు అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓటింగ్‌కు మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొత్తం మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్డు షోలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్షించినట్లు సమాచారం.

# మీరు ఎవరిని డిసైడ్ చేస్తే వారే అధికారంలోకి వస్తారు

గుగూల్ విషయంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ చేసారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల విషయంలో చెడు చేస్తున్నారని విమర్శించారు. మనకు ఇతర రాష్ట్రాల్లోనే పోటీ కాదని పోటీ ప్రపంచతోనే అని చెప్పుకొచ్చారు. అత్యుత్తమ యూనివర్సిటీ కి చెందిన కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. డిగ్రీల్లో కొత్త కోర్సులు తీసుకొని వచ్చామని చెప్పారు. చంద్రబాబు పాలనలో ఫీజు రీయంబర్స్ మెంట్ రూ 4,200 కోట్లు పెండింగ్ లో ఉందని వివరించారు. వసతి దీవెన కింద రూ 2,200 కోట్లు పెండింగ్ ఉందని చెప్పుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగంలోనే 6.3 లక్షల ఉద్యోగాలు ఇవ్వగలిగామని జగన్ చెప్పారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో 1.2 లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 52 వేల మందిని ఆర్టీసీలో రెగ్యులరైజ్ చేసామని ఆరోగ్య రంగంలో భారీగా ఉద్యోగాలు ఇచ్చామని వివరించారు. కాగా, ఇప్పుడు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నారని విమర్శించారు. ఇక గుగూల్ విషయంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ చేసారని జగన్ విమర్శించారు. సింగపూర్ నుంచి కేబుల్ తీసుకు వచ్చేలా అంకురార్పణ చేసింది వైసీపీ ప్రభుత్వంలో అని చెప్పారు. ఆదానీ – గుగూల్ లో 2022 లో నోయిడా డేటా సెంటర్ అగ్రిమెంట్ ఉందని గుర్తు చేసారు. వైసీపీ హయాంలోనే అన్ని ఏర్పాట్లు జరిగాయని ఈ కారణంగానే గుగూల్ వస్తుందన్నారు. మూల పేట నుంచి కట్టుకుంటూ వెళ్లామని వివరించారు. భోగాపురం విమానాశ్రయానికి అన్ని అనుమతులు తీసుకొచ్చి శరవేగంగా నిర్మాణాలు చేసామని చెప్పారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ సరి కాదన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకం గా ర్యాలీలు 11వ తేదీ నుంచి 12వ తేదీకి మార్పు జరిగిందని వెల్లడించారు. డిసెంబర్ లో ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆందోళనలు ఉంటాయని జగన్ స్పష్టం చేసారు.

# గెలుపెవరిదో సర్వేల్లో తేలడం లేదు

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తమ హామీల గురించి ప్రస్తావించడం లేదని, ఇచ్చిన గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడుతున్నారని, అన్ని సమస్యలకు అదే పరిష్కారమన్నట్లు వ్యవహరించడం వారి మూర?త్వమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఎక్కువ వాటా కేంద్రానిదేనని, ఆ పథకాన్ని ఆపేస్తామని సీఎం ఎలా అంటారని ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుకు గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో ఉండే కనీస అభివృద్ధి కూడా ఇక్కడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా నిధులు లేవని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైందని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై నమ్మకం లేకపోవడంతో జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోలేకపోతున్నారని, ఈ గందరగోళం సర్వేల్లోనూ ప్రతిబింబిస్తోందని ఆయన విశ్లేషించారు.

# యువతకు ఉద్యోగాల బదులు డేటా మత్తు

అదే సమయంలో కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలు మాత్రమే లబ్ధి పొందుతున్నారని ధ్వజమెత్తారు.బీహార్ సీఎం నితీశ్ కుమార్ పై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. ఆయన "రిమోట్ కంట్రోల్" ప్రధాని మోదీ చేతిలో ఉందని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఓట్ల దొంగతనాన్ని ప్రతిఘటించాలని, రాజ్యాంగాన్ని కాపాడాలని" యువ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన, విశ్వవిద్యాలయాల నిర్మాణం, ప్రపంచ స్థాయి నలందా విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి బీహార్ విద్యా వైభవాన్ని తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. "మేము మీ జేబుల్లో డబ్బు పెట్టాలనుకుంటున్నాం, బిలియనీర్ల జేబుల్లో కాదు" అని రాహుల్ స్పష్టం చేశారు. తమ మహాఘట్‌బంధన్ ప్రభుత్వం పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికుల కోసం పనిచేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

# వరుస ప్రమాదాలపై సీఎం చంద్రబాబు ఆవేదన

కర్నూలు బస్సు ప్రమాదంపై స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న సంక్లిష్టతలను ముఖ్యమంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ పర్మిట్లు ఇస్తున్నప్పటికీ, కొన్ని రాష్ట్రాలు నామమాత్రపు ఫీజులతో వాహన రిజిస్ట్రేషన్లు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "కర్నూలులో ప్రమాదానికి గురైన బస్సు ఒడిశాలో రిజిస్టర్ అయింది. తెలంగాణ నుంచి ఆపరేట్ చేస్తున్నారు. ప్రమాదం జరిగింది ఏపీలో, బస్సు వెళ్లేది కర్ణాటకకు. కానీ చనిపోయింది తెలుగువారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రమాదాన్ని ఎలా చూడాలి?" అని చంద్రబాబు ప్రశ్నించారు. ఈ తరహా పాలసీ లోపాలపై చర్చించి సరిదిద్దకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

**- కాశీబుగ్గ ఘటనకు అధికారుల వైఫల్యమే కారణం**

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ, ఇది స్పష్టంగా క్రౌడ్ మేనేజ్‌మెంట్ వైఫల్యమేనని అన్నారు. ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేయడంలో స్థానిక అధికారులు విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు. "అక్కడి సీఐ, ఎస్పీకి తెలియకుండా ఇంత పెద్ద ఘటన ఎలా జరిగింది? క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో లోపం ఎక్కడ జరిగింది?" అని ఆయన నిలదీశారు. తెలంగాణలోని చేవెళ్ల బస్సు ప్రమాదంలోనూ భారీ ప్రాణనష్టం జరగడంపై విచారం వ్యక్తం చేశారు.

**- పటిష్ఠమైన వ్యవస్థ అవసరం**

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం స్పందించడమే కాకుండా, అవి మళ్లీ జరగకుండా చూడటమే ప్రభుత్వాల బాధ్యత అని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం పటిష్టమైన రెగ్యులేటరీ అథారిటీ, స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉండాలని నొక్కిచెప్పారు. ప్రమాదాల్లో ఎక్కువగా నిరుపేదలే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# సునీతకు బిగ్ షాక్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కారు పార్టీకి ఇది పెద్ద దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎలక్షన్ దగ్గరపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతకు బిగ్ షాక్ తగిలింది. సునీతకు ఫ్యామిలీ సర్టిఫికేట్ ఇవ్వడంపై మాగంటి గోపీనాథ్ మొదటి భార్య మాలినీ దేవి అభ్యంతరం తెలిపారు. ఇదే విషయంపై శేరిలింగంపల్లి తహసిల్దార్ చేపట్టిన విచారణలో ఆమె పాల్గొన్నారు. మరోవైపు సునీతపై మాగంటి గోపీనాథ్ మొదటి భార్య కొడుకు ప్రద్యుమ్న ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాగంటి కుటుంబంలో కలహాల నేపథ్యంలో ఆ ప్రభావం ఎన్నికల్లో పడనుందని బీఆర్ఎస్ వర్గాలు ఆందోళనలో ఉన్నాయి. ఇక మాగంటి గోపినాథ్ తల్లి మహానందకుమారి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కనీసం సునీత పోటీ చేస్తున్న విషయం కూడా తనకు తెలియదని వెల్లడించారు. సునీతకు తనతో కూడా మాటలు లేవన్నారు.

అంతేకాక కేటీఆర్ వల్లే తన కుమారుడు చనిపోయాడని మాగంటి గోపినాథ్ తల్లి మహానందకుమారి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మనవడికి అన్యాయం చేయొద్దని అన్నారు. తన మనవడు ప్రద్యుమ్న తారక్ కు తన తండ్రి వారసుడిగా అన్ని హక్కులకు అర్హుడని పేర్కొన్నారు. తాజాగా మాగంటి కుటుంబ వివాదం బీఆర్ఎస్ ప్రచారానికి ప్రతికూలంగా మారే అవకాశం ఉండటంతో, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీకి పెద్ద దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.

# ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల ఆర్థిక సంఘటితానికి, జాతీయ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు సరికావన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై బ్యాంకు యూనియన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ, దేశానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎంతో సేవ చేస్తున్నాయని పేర్కొన్నాయి. అలాంటి బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న ఆలోచనలను మానుకోవాలని విజ్ఞప్తి చేశాయి. మూలధన సాయం అందించి ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 9 ట్రేడ్ యూనియన్లతో కూడిన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఒక ప్రకటనను విడుదల చేసింది.

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద 90 శాతం ఖాతాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఉన్నాయని గుర్తు చేసింది. ప్రాధాన్యతా రంగాలకు, ప్రభుత్వ పథకాలు ఈ బ్యాంకుల ద్వారానే అందుతున్నాయని తెలిపింది. గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత ప్రభుత్వ రంగ బ్యాంకులతోనే సాధ్యమైందని పేర్కొంది. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండటానికి ప్రభుత్వ రంగ బ్యాంకులే కారణమని వెల్లడించింది. అలాంటి బ్యాంకులను ప్రైవేటీకరిస్తే కార్పోరేట్లకే ప్రయోజనం చేకూరుతుందని, ప్రజలకు కాదని తెలిపింది. ప్రైవేటీకరణ జాతి ప్రయోజనాలకు విఘాతమేనని పేర్కొంది. ఇలాంటి నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ, పార్లమెంటు వేదికగా చర్చ జరగాలని గుర్తు చేసింది.

జాతీయాకరణ కంటే ముందు బ్యాంకులు పారిశ్రామికవేత్తలు, పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలు లక్షలాది గ్రామాలకు విస్తరించగా, ప్రైవేటు బ్యాంకులు గ్రామీణ స్థాయిలో నామమాత్రంగానే సేవలు అందిస్తున్నాయని తెలిపింది. ఆర్థిక మాంద్యం, కొవిడ్ సమయాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశానికి వెన్నుదన్నుగా నిలిచాయని వెల్లడించింది.

# మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

మంచిర్యాల, : ఏఐటీయుసి గని ఫిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ గురువారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని ఆవరణలో మాట్లాడుతూ, మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి పాత విధానంలోనే ఇన్వాలిడేషన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా కు వినతిపత్రం సమర్పించి, సింగరేణిలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## సీసీఐ కొనుగోలు నిరాకరణతో

# వాంకిడి రైతుల రాస్తారోకో



ఆసిఫాబాద్, : వాంకిడి మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద జిన్నింగ్ యార్డు సమీపంలో సుమారు 150 మంది రైతులు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాస్తారోకో నిర్వహించారు. సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడానికి నిరాకరించడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐ గారు రైతులతో, సీసీఐ అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

# సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన

సిర్పూర్, : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, గురువారం ఉదయం వాకింగ్ చేసే ప్రజలకు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ లింక్స్ ద్వారా మోసాలు చేస్తున్న సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద లింక్స్ పై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని సూచించారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## చింతలమానేపల్లీ మండలాల్లో

# మాఫియా రాజ్యం

బెల్లంపల్లి, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానేపల్లీ మండలాల్లో ఇసుక మాఫియా కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డబ్బా ధరంపల్లి వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా బోధంపల్లి, ధరంపల్లి గ్రామాల సమీపంలో భారీగా ఇసుక డంపింగ్ జరుగుతోందని, ఆ ఇసుకను జెసిబీలతో లారీలలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ అక్రమ రవాణాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

చెన్నూరు, : మండలంలోని ముత్నూరు గ్రామ శివారులోని మెండపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బొల్కె సంతోష్ (22) అనే యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దన్వే సంజీవ్ తీవ్రంగా గాయపడటంతో రిమ్స్‌కు తరలించారు. స్థానికులు, ఉట్నూరు సీఐ మడావి ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. ఉట్నూరు డిపో బస్సు ఇంద్రవెల్లి నుంచి గుడిహత్నూరు వైపు వెళుతోంది. మెండపల్లి క్రాస్ రోడ్డు వద్ద గుంతలను తప్పిస్తూ బస్సును నడిపే క్రమంలో ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్‌కు చెందిన సంతోష్, సంజీవ్‌లు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. సంతోష్ ఘటనా స్థలిలో మృతి చెందారు. సంజీవ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# రైతును చిదిమేసిన అకాల వర్షాలు

వేములవాడ, : శంకరపట్నం మండలంలో మొంథా తుఫాను బీభత్సం సృష్టించింది. దాదాపు 2100 ఎకరాల్లో పంటలు నేలకొరిగి, నీట మునిగి, ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముత్త పెద్దపురం అనే రైతు తన నాలుగు ఎకరాల వరి చేను నేలకొరగడంతో, లక్షన్నర పెట్టుబడి నష్టపోయి, 20 మంది కూలీలతో చేతితో వరి కోయిస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నారు.

# ట్రాక్టర్ యజమానుల దినోత్సవం ఘనంగా

సిర్పూర్, : బోయినపల్లి మండలం తడగొండలో గురువారం ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ యజమానుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 6న జరుపుకునే ఈ దినోత్సవం వ్యవసాయ రంగంలో ట్రాక్టర్ల ప్రాముఖ్యతను చాటింది. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రెండ్ల గంగరాజు, ఉపాధ్యక్షులు గోగురి తిరుపతిరెడ్డి, చెపురి లచ్చయ్య, విలసాగర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బుర్ర రాజు, క్యాషియర్ చేపూరి మహేష్, కార్యవర్గ సభ్యులు గోదల మనోహర్, మాజీ సర్పంచ్ రమేష్, మాజీ ఉపసర్పంచ్ వరలక్ష్మి కనకయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, గుడి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై ఉదయం వాకర్స్ కు అవగాహన

జగిత్యాల, : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా, జగిత్యాల పట్టణంలో టౌన్ సీఐ కరుణాకర్ వాకింగ్ చేసే ప్రజలను కలిసి, సైబర్ మోసాల నుండి రక్షించుకునే విధానాలపై వివరించారు. ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# జగిత్యాల జిల్లాకు వచ్చిన హెడ్ కానిస్టేబుళ్లు, ఎస్పీని కలిసిన సిబ్బంది

కోరుట్ల, : పదోన్నతి బదిలీలలో భాగంగా నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల నుండి జగిత్యాల జిల్లాకు వచ్చిన 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు సిబ్బందికి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# వరి ధాన్యం ట్రాక్టర్ వాగులో కొట్టుకుపోయింది, అధికారులు నిర్లక్ష్యంపై ఆగ్రహం

ధర్మపురి, : %కామారెడ్డి జిల్లా చిన్న దేవాడ శివారులోని కౌలస్ వాగులో వరి ధాన్యం లోడ్ తో వెళ్తున్న ట్రాక్టర్ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ప్రాజెక్ట్ అధికారులు పరీక్షణ పేరుతో గేట్లు ఎత్తినప్పుడు పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో రైతు సురక్షితంగా బయటపడగా, ట్రాక్టర్ వాగులో కొట్టుకుపోయింది.

# ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్**




రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్ షిప్స్. ఫీజు రీయంబర్స్ మెంట్స్ పూర్తిగా ప్రభుత్వ భాద్యత అని వాటిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కే వై ప్రణయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ నిధుల విడుదల కోసం చేస్తున్న ఆందోళనలో భాగంగా గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. .రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయంబర్స్ మెంట్స్ విడుదల చేయకుండ టిఆర్ఎస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని ప్రణయ్ ఆరోపించారు . ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ ఇవ్వవలసిన ఫీజులను విడుదల చేయలేదు. కమిటీలు పేరుతో కాలయాపన చేయకుండ ప్రభుత్వం ఫీజులు బకాయిలు విడుదల కోసం శాశ్వత పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.అధ్యయనం చేసి, నిర్ణయిస్తామని చెప్పడం అంటే పూర్తిస్థాయిలో ప్రభుత్వం తమ భాద్యత నుండి తప్పుకోవడమేనని విమర్శించారు.తక్షణమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్, తరుణ్, సతీష్, సాయి,కిరణ్,ఇస్మాయిల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 35 లక్షల రూపాయలతో మధురానగర్ ప్రధాన రోడ్డు పనులు ప్రారంభం

**మాజీ కౌన్సిలర్ స్రవంతి శ్రీకాంత్ రెడ్డి**



రాజేంద్ర నగర్(ప్రశ్న న్యూస్) 35 లక్షల రూపాయల వ్యయంతో హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న ఎస్. భవర్చి హెూటల్ నుండి నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను గురువారం ప్రారంభించినట్లు స్థానిక మాజీ కౌన్సిలర్ సర్వేంద్రి స్రవంతి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శంషాబాద్ మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశంలో నిర్ణయించిన మేరకు రోడ్డు నిర్మాణానికి 35 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసిందని తెలిపారు. ఈ మేరకు పనులను గురువారం ప్రారంభించినట్లు తెలిపారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు రంజిత్ రెడ్డి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. మున్సిపల్ మాజీ చైర్మన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి. నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్. కో ఆప్షన్ మాజీ మెంబర్ కవితా ప్రసాద్ సమిష్టి కృషితో సహకారంతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు స్రవంతి శ్రీకాంత్ రెడ్డి వివరించారు. స్థానిక ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించి ఒకసారి రోడ్డు నిర్మాణం చేసిన తర్వాత మంచినీటి పైప్లైన్ల కోసం. డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం కోసం అంటూ రోడ్డును తొవ్వడం. ధ్వంసం చేయడం లాంటి చర్యలకు పూనుకోవద్దని సూచించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వేలాది మందికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి క్యూరింగ్ అయ్యేవరకు అందరూ సహకరించాలని కోరారు . రోడ్డు నిర్మాణానికి సహకరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సొసైటీ, పూడూరు సొసైటీ, డబిల్ పూర్ సొసైటీ కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటూ రైతు అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రైతులెవరూ కూడా దళాలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్మాలని సూచించారు.

ఏమైనా సందేహాలు ఉంటే రైతులు వ్యవసాయ అధికారులను గానీ, సొసైటీ కేంద్రాలను గానీ సంప్రదించాలన్నారు. రైతును అభివృద్ధి చేసేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ సొసైటీ చైర్మన్ సురేష్ రెడ్డి, మేడ్చల్ సొసైటీ చైర్మన్ రణదీప్ రెడ్డి, పూడూరు సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, శివ శంకర్, బిక్షపతి, వరదారెడ్డి, ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# యువకుని ఆత్మహత్య

**- కేసు నమోదు - దర్యాప్తు ప్రారంభం**

**- కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : ఏ. నిరంజన్ రెడ్డి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన ముస్కు శివ (25) అనే యువకుడు కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి గురువారం వెల్లడించారు.
సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం : శివకు 11 నెలల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండగా, పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా ఉపశమనం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈనెల 1వ తేదీన గ్రామ శివారులో తెలియని గడ్డి మందు సేవించగా, కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్లోని సన్రైజ్ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం చేర్పించారు.అయితే చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున సుమారు 1.47 గంటల సమయంలో శివ మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# బీసీల హక్కుల సాధన దిశగా డాక్టర్ బీఆర్ అంబేష్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

**- 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ నేతల పోరాటం**

**- బీసీ సంఘం ఉమ్మడి జిల్లా జేఏసీ అధ్యక్షులు : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ జేఏసీ నేతలు రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ బీసీల హక్కులు,వాటా–కోటా సాధనకై చేస్తున్న ఈ పోరాటం ఎలాంటి వర్గానికి వ్యతిరేకం కాదని అన్నారు. కోర్టుల తీర్పులు ఎలా ఉన్నా, చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో కదారి రాములు,ఇల్లందుల వెంకటేష్,పిన్నింటి హన్మాండ్లు, ఉయ్యాల భూమయ్య, మొగిలోజు సత్యం,కనపర్తి సుధాకర్,మల్లారం దేవయ్య, తదితర బీసీ సంఘం జేఏసీ నేతలు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతకు ప్రాధాన్యం

**- నిర్లక్ష్య వాహన దారులపై కఠిన చర్యలు తీవ్రం**

**-వేములవాడ లో డస్ట్ తరలిస్తున్న టిప్పర్ సీజ్**

**- వేములవాడ అదనపు ఎస్పీ : శేషాద్రిని రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, నిబంధనలకు విరుద్ధంగా డస్ట్ను రవాణా చేస్తున్న టిప్పర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా డ్రైవర్ నడుపుతున్నాడని గుర్తించి సీజ్ చేశారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించి, మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి మాట్లాడుతూ, “డస్ట్,గ్రావెల్,కంకర వంటి పదార్థాలను తరలించే సమయంలో వాహనదారులు కప్పివేసే చర్యలు తీసుకోవాలి. ప్రజలపై ధూళి పడే విధంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.భారీ వాహనాలు నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇలాంటి వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతర తనిఖీలు కొనసాగుతాయని అదనపు ఎస్పీ తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా బోయినిపల్లి నేతల ప్రచారం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి ఊపు పెరుగుతోంది. గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి బోయినిపల్లి మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రజలతో మమేకమై,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.నవీన్ యాదవ్ విజయం ద్వారా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని తెలిపారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనడంతో ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

# రోడ్డు భద్రతా పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**- రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం - బాధ్యతగా వాహనాలను నడిపిద్దాం**

**- మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవు**

**- వేములవాడ అదనపు ఎస్పీ : శేషాద్రిని రెడ్డి**

**- వేములవాడ లో డ్రైవర్లకు అవగాహన సదస్సు**



వేములవాడ2 (ప్రశ్న న్యూస్ ) రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి పిలుపునిచ్చారు.వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన హెవీ వెహికిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాహన డ్రైవర్ల



అవగాహన సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి పాల్గొని వాహనదారులతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ“రోడ్డు మీదకి వచ్చే ప్రతి డ్రైవర్ తన వాహన పరిస్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవాలి. నిర్లక్ష్యంగా, వేగంగా,మద్యం సేవించి వాహనం నడిపితే మీ ప్రాణమే కాకుండా ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి. అలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు,” అని హెచ్చరించారు.అలాగే భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు దీర్ఘ ప్రయాణాలకు బయలుదేరే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలని, వాహనాలు పరిమితికి లోబడి లోడ్ చేసుకోవాలని సూచించారు.“డ్రైవింగ్ వృత్తి అనేది కేవలం జీవనోపాధి మాత్రమే కాదు, అనేక కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసే బాధ్యత” అని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.
తదుపరి ప్రతి డ్రైవర్తో రోడ్డు భద్రతా నియమాలను పాటించాలనే ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు తిప్పపూర్ బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డస్ట్ తరలిస్తున్న ఒక టిప్పర్ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్ఐలు రామ్మోహన్, రాజు, హెవీ వెహికిల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నియంత్రణకు డ్రైవర్లు కృషి చేయాలి

పెద్దపల్లి, : జగిత్యాల డిపో మేనేజర్ కే. కల్పన గురువారం జగిత్యాల బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించి, ప్రమాదాల నియంత్రణకు డ్రైవర్లు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రవి కిరణ్, డిపో మేనేజర్ కల్పన, ఎం. ఎఫ్ కవిత, స్టేషన్ మేనేజర్ రవీందర్ రావు, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రాంగణం పరిశీలన

పినపాక, : పినపాక మండలం బయ్యారం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలను గురువారం జెడ్పి సీఈవో నాగలక్ష్మి పరిశీలించారు. పినపాక ఎంపీడీవో సంకీర్త్, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ నాగయ్య ఆధ్వర్యంలో ఆటల గ్రౌండ్ ను పరిశీలించిన ఆమె, 33 జిల్లాల నుండి క్రీడాకారులు వస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని ఆమె తెలిపారు.

# కార్తీక మాసం సందర్బంగా ప్రత్యేక బస్సులు

కొత్తగూడెం, : కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాజ్యలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నెల 9న రాత్రి 9 గంటలకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంతో పాటు, పంచారామాలు (అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట) కు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలు భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయని అధికారులు ఆశిస్తున్నారు.

# టిప్పర్ను ఢీకొట్టిన మరో టిప్పర్

భద్రాచలం, : గురువారం చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామంలో ఆగి ఉన్న టిప్పర్ లారీని, వేగంగా వచ్చిన మరో టిప్పర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక నుంచి ఢీకొట్టిన లారీ డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## యు.టి.యం పౌండేషన్ స్వచ్ఛ గ్రామం కోసం శ్రమించింది

అశ్వారావుపేట, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావు పేట మండల కేంద్రంలో యు.టి.యం పౌండేషన్ సభ్యులు గురువారం నాడు రోడ్లపై పడి ఉన్న చెత్త, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ కవర్లు, డ్రైనేజీలలోని వ్యర్థాలను తొలగించారు. వేలేరుపాడు మండలంలోని కోయమాదారం గ్రామంలో ‘స్వచ్ఛ విలేజ్’ కార్యక్రమం నిర్వహించి, గ్రామస్తులతో కలిసి పరిశుభ్రత చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వాతావరణ కాలుష్యం, సీజనల్ వ్యాధులను నివారించవచ్చని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పౌండేషన్ డైరెక్టర్ పాయం స్టీవెన్ తెలిపారు.

# పినపాక ఎమ్మెల్యే ఆదేశాలతో బూర్గంపహాడ్-సారపాక రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ఇల్లందు, : పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, బూర్గంపహాడ్ రైస్ మిల్ సెంటర్ నుండి సారపాక పట్టణం వరకు “ఆర్.అండ్.బి” అధికారులు తాత్కాలిక రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. ఈ పనులను కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం సమీక్షిస్తోంది.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి లక్ష దీపాలతో సోమేశ్వర స్వామిని ఆరాధించారు

పాలకుర్తి, : పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి రాత్రి జనగామ జిల్లాలోని పాలకుర్తి సోమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపాలతో అఖండ జ్యోతిని వెలిగించారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, అష్టైశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని ఆమె స్వయంభు సోమలింగేశ్వర స్వామిని ఆరాధించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు:

# పోరాటం ఆగదు - బీసీ జేఏసీ

కొల్లాపూర్, : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం మౌన పోరాట దీక్ష చేపట్టారు. జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ బెక్కం జనార్ధన్, కో-చైర్మన్ మున్నూరు రాజు మాట్లాడుతూ, స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతంగా ఉంటాయని హెచ్చరించారు. బీసీలను విస్మరిస్తే తగిన గుణపాఠం నేర్పుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ధూప దీపాలు లేని ఆలయాల అభివృద్ధికి పాదయాత్ర

వనపర్తి, : వనపర్తిలో ధూప దీపాలు లేని దేవాలయాల అభివృద్ధికి, నిత్యం ధూప, దీప, నైవేద్యాలు, పూజలు, అభిషేకాలు, అర్చనలు కళకళలాడాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా 7వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుమలయ్య గుట్టకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన కూడా వెంకటేశ్వర స్వామి భక్తులందరూ తిరుమలయ్య స్వామిని దర్శించుకోవడానికి పాదయాత్రగా రావాలని పిలుపునిచ్చారు. ప్రతి భక్తుడు హిందూ సాంప్రదాయబద్ధంగా తెల్ల షర్టు, తెల్ల పంచె, కండువా ధరించి రావాలని విజ్ఞప్తి చేశారు.

# గద్వాల్ జిల్లాలో విషాద ఘటన

గద్వాల, : గద్వాల పట్టణ శివారులోని బీడీ కాలనీకి చెందిన సలీం (14) అనే మైనర్ బాలుడు కృష్ణానదిలో ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లి, రేకులపల్లి సమీపంలోని గుండాల జలపాతం వద్ద నదిలో దిగినప్పుడు కాలు జారి లోతైన ప్రవాహంలో కొట్టుకుపోయాడు. గజ ఈతగాళ్ల సహాయంతో గురువారం ఉదయం మృతదేహాన్ని వెలికితీశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## ఆటోను ఢీకొన్న కారు..పలువురికి తీవ్ర గాయాలు

ఆలంపూర్, : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ జాతీయ రహదారిపై ఆటోను.. కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామానికి చెందిన కొందరు మహిళా కూలీలు ఆటోలో ఎర్రవల్లి మండలం బోరెల్లి గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు నుంచి వనపర్తికి వస్తున్న కారు పట్టణంలోని జాతీయ రహదారిపై కర్నూలు బైపాస్ విభాగిని మలుపు వద్ద ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు (అక్కమ్మ, పీరమ్మ, గీరమ్మ లతో పాటు డ్రైవర్ రవి)లకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది క్షతగాత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

# వెట్టిచాకిరీ నుంచి విముక్తి

సూర్యాపేట, : మంచాలకట్ట, మల్లేశ్వరం వద్ద కృష్ణానదిలో చేపలు పట్టించే గుత్తేదారుల దగ్గర పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలకు ఎస్పై రామన్ గౌడ్ విముక్తి కల్పించారు. బాధితుల కుటుంబ సభ్యులు గుత్తేదారు పెడుతున్న ఇబ్బందులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దాడులు చేసి నలుగురికి విముక్తి కల్పించారు. గురుమూర్తి (శ్రీకాకుళం), శంకర్ (విజయవాడ), దుర్గాప్రసాద్ (ఉత్తర్‌ప్రదేశ్), పంచలాలు (ఛత్తీస్‌గఢ్)కు గుత్తేదారు నుంచి జీతం డబ్బులు ఇప్పించి వారి గ్రామాలకు పంపిస్తామన్నారు.

## 11వ జోన్ లెవెల్ గేమ్స్ ప్రారంభం..

తుంగతుర్తి, : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సిల్ స్కూల్, కాలేజ్ లో 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ (గర్ల్) 2025 క్రీడపోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్వో దయానంద్, ప్రిన్సిపల్ గుడిపాటి సైదులు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదో జోన్ లోని 28 గురుకులాల నుంచి (5బి)లోని తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, ఆలేరు, అడ్డగూడూరు వంటి స్కూల్స్ విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు.

# చదువులకు బకాయిల చిక్కులు

భువనగిరి, : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తలపెట్టిన బంద్ రోజు రోజుకి ఉద్ధృతమవుతోంది. బంద్‌లో ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ తదితర వృత్తి విద్యాకళాశాలలు పాల్గొంటున్నాయి. దీంతో అన్ని కోర్సుల విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడింది. తాజాగా ఫార్మసీ కళాశాలల్లో జరగాల్సిన ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి.

## కుక్కను తప్పించబోయి.. అదుపు తప్పిన కారు

ఆలేరు, : రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డుకిందకు దూసుకెళ్లగా ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం వద్ద తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పోచవరం గ్రామానికి చెందిన అన్నపర్తి సాయిరాం తన భార్య, కూతురు, కుమారుడితో కలిసి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లో ఉంటున్నారు. అనారోగ్యానికి గురైన తన తండ్రిని చూసేందుకు హైదరాబాద్ నుంచి సాయిరాం కుటుంబం సొంత కారులో స్వగ్రామానికి బయలుదేరింది. ఖమ్మం వైపు వెళుతుండగా మామిళ్లగూడెం విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలోకి రాగానే కుక్క అడ్డు రావడంతో సడన్ బ్రేకులు వేశారు. దీంతో కారు రోడ్డు ఎడమ వైపునకు కిందకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో వెనక తలుపులు తెరుచుకుని అందులో కూర్చున్న ముగ్గురు ఎగిరి బయటపడ్డారు. వీరందరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. కారు నడుపుతున్న కుటుంబ యజమాని ముందున్న ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది 1033 అంబులెన్స్‌లో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో ఎ.రాణి(42) మృతి చెందినట్లు భర్త సాయిరాం తెలిపారు. పదిహేడేళ్ల కూతురు, పదేళ్ల కుమారుడికి తీవ్రగాయాలైనట్లు పేర్కొన్నారు.

# కోత పెట్టినా కేటాయించారు..!

హుజూర్‌నగర్, : జిల్లాలో ధాన్యం కేటాయింపులు జరిగిన మిల్లుల్లోని కొన్నింటి నిర్వాహకుల దోపిడీకి అడ్డులేకుండా పోతోంది. అడిగేవారు లేరని..చూసేవారు రారని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కిలోల కొద్ది తరుగు పెడుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేటలో ఓ ప్రధాన రహదారి వెంట ఉన్న మిల్లరు నిబంధనలను తాలులో కలిపేస్తూ కర్షకుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గత యాసంగిలో తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని ఓ కొనుగోలు కేంద్రానికి ఆ మిల్లును కేటాయించారు. నిర్వాహకులు ముందుగా ఒక లారీ పంపిస్తే బస్తాకు 3 కిలోల చొప్పున కోత పెట్టారు. మొదటిది కదా అని ఓపిక పడితే.. తర్వాత పంపించిన మరో రెండు లారీలకు అదే పరిస్థితి ఎదురైంది.

## పిట్లం సాయిబాబా ఆలయంలో

# భక్తుల రద్దీ, ప్రత్యేక పూజలు

జుక్కల్, : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సాయిబాబా దర్శనం చేసుకున్నారు.

పుష్పాలు, కొబ్బరికాయలు, హారాలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఆరతులలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయిబాబా భజనలు, ప్రసాదం పంపిణీతో ఆలయం భక్తి వాతావరణంతో నిండిపోయింది.

## హిందువు ముస్లిం టోపీ పెట్టుకునే రోజు వస్తే

# తల నరుక్కుంటా

## - బోరబండలో బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బోరబండ ఎన్నికల సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఓట్ల కాంగ్రెసోళ్లు తురకోళ్ల లెక్క టోపీ పెట్టుకుని, నమాజ్ చేస్తూ డ్రామాలాడుతున్నరు. మళ్లా చెబుతున్నా, నేను అట్లాంటి పని చేయను. ఎందుకంటే నేను హిందువును. ఇతర మతాలను గౌరవిస్తా తప్ప కించపర్చను. ఒకవేళ టోపీ పెట్టుకునే పరిస్థితే వస్తే నా తల నరుక్కుంటా. టోపీ మాత్రం పెట్టను" అని ప్రకటించారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండలో నిర్వహించిన సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై సంజయ్ మాటల తూటాలు పేల్చారు. "కాంగ్రెసోళ్లను చూస్తుంటే అనుమానమొస్తుంది. వీళ్ల డీఎన్ఏను చెక్ చేయాల్సిందే"అంటూ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం వెనుక మాజీ మంత్రి కేటీఆర్ హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. "ఇది నా మాట కాదు. గోపీనాథ్ తల్లి చెప్పిన మాటనే చెబుతున్నా. సీఎం రేవంత్ రెడ్డికి ఏ మాత్రం పౌరుషమున్నా గోపీనాథ్ మరణంపై సమగ్ర దర్యాప్తు చేయించాలి. కేటీఆర్ ను బొక్కలో వేసి థర్డ్ డిగ్రీ విచారణ చేయాలి. అప్పుడే వాస్తవాలు బయటపడతాయి"అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పెద్ద మూరు?డు ఆయన కొడుకు ఇంకా మూరు?డు. ఈమధ్య జనతా గ్యారేజ్ డైలాగ్ కొడుతున్నడు. మూడేళ్ల తరువాత వాళ్ల అయ్య బయటకు వస్తడట. సీఎం అయితడు. జనం చస్తుంటే రాడు, రైతులు అల్లాడుతుంటే రాడు. యాక్సిడెంట్స్ అయి జనం పోతుంటే రాడు ఇగ సీఎం ఎక్కడైతడు? అసలు కేటీఆర్ కు తండ్రి సీఎం కావాలనే ఆశ లేనేలేదు తండ్రిని పక్కకు తోసి ఎప్పుడెప్పుడు సీఎం కావాలని చూస్తున్నడు కేటీఆర్ కు వావి వరసల్లేవు. చిన్నా పెద్దా ముసలి ముతక అనే తేడా లేనే లేదు. హింస పెట్టిండు, కల్వకుంట్ల కవిత అంతో ఇంతో తల్లిదండ్రులను అంతో ఇంతో మంచిగ చూసుకునేది ఆడపిల్లలే మీ అన్న, మీ బావ, మీ బాబాయి కొడుకుతో జాగ్రత్త అప్పుడప్పుడు కేసీఆర్ దగ్గరకు వెళ్లి బాగోగులు చూసుకో అని సలహా ఇచ్చారు.ప్రజలు అల్లాడుతుంటే ఓదార్చింది మేం, రైతుల బాధను పంచుకుంది మేం ఈ రెండేళ్లలో కేసీఆర్, ఆయన కొడుకు ఎన్నడైనా వచ్చాడా? అందుకే జూబ్లిహిల్స్ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు కనువిప్పు కావాలి. మాగంటి గోపీనాథ్ చావుకు కారణం కేటీఆరేనని ఆమె తల్లే చెబుతోంది. అందుకే నేను డిమాండ్ చేస్తున్నా. గోపీనాత్ మరణంపై విచారణ జరపాలి. రేవంత్ రెడ్డి నీకు రోషం, పౌరుషం ఉంటే విచారణ జరపాలి. ట్విట్టర్ టిల్లును లోపలేసి థర్డ్ డిగ్రీ చేసి విచారణ జరపాల్సిందే అన్నారు. ఎంఐఎం నాయకులు చైన్ స్నాచర్స్ వాళ్లతో జాగ్రత్త. వాళ్లతో జత కొడుతున్న కాంగ్రెసోళ్లు గెలిస్తే ఆడవాళ్ల మెడలో ఉన్న మంగళ సూత్రం కూడా గుంజుకుపోతారు జాగ్రత్త. 6 గ్యారంటీలను అమలు చేస్తామని మాట ఇచ్చిన తప్పిన సీఎం రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తానన్న రేవంత్ రెడ్డి రూ.9 వేల కోట్ల అవినీతిపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాసిండు. ఎవరిని కాపాడేందుకు లక్ష కోట్ల అవినీతిపై విచారణ అడగడం లేదు? కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే. దేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి దోచుకున్న పార్టీలు ఏవైనా ఉన్నాయంటే అవి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే. హైదరాబాద్ లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే అది మోదీ ప్రభుత్వం ఇస్తున్న నిధులేజ నేను సవాల్ చేస్తున్నా హైదరాబాద్ అభివృద్ధిపై లెక్కా పత్రంతో చర్చించేందుకు మేం సిద్ధం. మేం అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే వాళ్లు మతం గురించి మాట్లాడుతున్నరు. వాళ్లవి లక్ష ఓట్లు మాత్రమే మరి మన ఓట్లు 3 లక్షలు ఓట్లు. కానీ వాళ్ల ఓట్ల కోసం ఒవైసీ సంకనాకుతున్నరు. రావు వచ్చినా, రెడ్డి వచ్చినా మేం చెప్పినట్లు వినాల్సిందేనని ఒవైసీ చెప్పినా పౌరుషం లేని దద్దమ్మలు కాంగ్రెసోళ్లు అని మండిపడ్డారు.ఒక వర్గం ఓట్ల కోసం టోపీ పెట్టుకున్న రేవంత్ రెడ్డిని చూస్తే సినిమా యాక్టర్ వేణుమాధవ్ గుర్తుకొచ్చిండు. రేవంత్ టోపి పెట్టుకుంటే పక్కనే ఉన్న అజహరుద్దీన్ కూడా ఓట్ల బిచ్చగాళ్ల లెక్క చూసి నవ్వుతున్నడు. అజహరుద్దీన్ చేత వక్రతుండ అని గణేష్ మంత్రం చదవించే దమ్ముందా? నీకు దమ్ముంటే ఒవైసీ సొదురులను భాగ్యలక్ష్మి టెంపుల్ కు తీసుకుపోయి బొట్టు పెట్టించి అమ్మవారి పాట పాడించే దమ్ముందా? జూబ్లిహిల్స్ ఓటర్లరా 30 శాతం ఓట్ల కోసం 70 శాతం ఓట్లను పక్కనపెట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.హిందువులారా మీరంతా ఓటు బ్యాంకుగా మారి మీ సత్తా చాటండి. ముస్లింల ఇండ్లకు పోయి మిక్సర్, గ్రైండర్, కుట్టు మిషన్లు ఇస్తూ దండం పెడుతున్నరు. హిందువులను మాత్రం పట్టించుకోవడం లేదు. రేవంత్ రెడ్డి 40 వేల బురఖాలను తెప్పించాడట.

బురఖాలు వేయించి దొంగ ఓట్లు వేయించుకుని గెలవాలని చూస్తున్నడు. ఎన్నికల కమిషన్ ను కోరుతున్నా మీరు దొంగ ఓట్లపై నజర్ పెట్టండి. రాముడి వారసులైన బీజేపీకి ఓటేయాలని జూబ్లిహిల్స్ ఓటర్లను కోరుతున్నా. 3 లక్షల మంది హిందూ ఓటర్లంతా ఒక్కటైతే ఎట్లా ఉంటదో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు రుచి చూపించాలన్నారు.

## రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను

# కాపాడవచ్చు: నూర్ మహమ్మద్ అలీ

### శ్రీ చైతన్య రామంతాపూర్ పాఠశాలలో మెగా రక్తదాన కార్యక్రమం





ఉప్పల్( ప్రశ్న న్యూస్) అన్న దానం చేస్తే ఓ పూట ఆకలి తీర్చొచ్చు. విద్యా దానం చేస్తే జ్ఞానం పంచొచ్చు. అదే రక్త దానం చేస్తే ప్రాణ దాతలు కావచ్చు అని అందుకే అన్ని దానాల కంటే రక్త దానం గొప్పది అని శ్రీ లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జ్ వేణుగోపాల్ అన్నారు.శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ డా? ఝాన్సీ లక్ష్మీ బాయి జన్మ దినోత్సవ సందర్భంగా శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు రామంతాపూర్ బ్రాంచ్ లో నిర్వహించారు.ఈ క్యాంపునకు రామంతాపూర్, మేడిపల్లి, తార్నాక బ్రాంచ్ నుంచి ఉపాధ్యాయ బృందం మరియు తల్లిదండ్రులు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం దానం చేశారు. ఈ సందర్భంగా నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహ్మద్ అలీ మాట్లాడుతూ రక్త దానం చేయడం వలన ఇతరుల ప్రాణాలను కాపాడడమే గాకుండా కొన్ని తీవ్ర మైన వ్యాధుల నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుందని రక్త దానం చేయడమంటే మరొకరికి జీవితాన్ని ఇవ్వడ మని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తదానం చేయాలని రక్తదానం చేయడం వలన ఎలాంటి ఆపద రాదని, వేరొకరి ప్రాణాలను కాపాడిన వారం అవుతామని,రక్తం దొరక్క ఇబ్బంది పడకూడదనే ఆశయం తో రక్త-దానం ప్రతి ఒక్కరు చేయవలసిందిగా తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణగూడ జోన్ ఆర్.ఐ.మల్లిఖార్జున నాయుడు,మేడిపల్లి ప్రిన్సిపల్ అనంత రామ్, తార్నాక ప్రిన్సిపల్ ప్రశాంతి, వైస్ ప్రిన్స్ పల్ శ్రీ కీర్తి కోన, డీన్ నాగారాజు, ఇంచార్టులు అరుణ్ కుమార్, వెంకటేష్ గుప్త మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాల్లో

# పంతుళ్ళ దురుసు ప్రవర్తనపై జర్నలిస్టుల ఫిర్యాదు




భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాల్లో విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులు,అధికారులు, భక్తుల పట్ల ఆలయ పంతుళ్ళు దురుసుగా ప్రవర్తించారంటూ జర్నలిస్టుల యూనియన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం భీంగల్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు పోలీసులను కలిసి ఫిర్యాదు అందజేశారు. జర్నలిస్టులు వెల్లడించిన వివరాల ప్రకారం : జాతర ఉత్సవాల కవరేజ్ కోసం లింబాద్రి గుట్టకు వెళ్లిన జర్నలిస్టులతో ఆలయ ధర్మకర్త కుమారుడు ప్రోత్సాహంతో ఆలయ అర్చకులు దురుసుగా ప్రవర్తించడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడి అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రథ భ్రమణం సందర్భంగా తాడును లాగుతున్న భక్తులపై పిడిగుద్దులు కురిపించారని, అన్నసత్రంలో సేవ పేరిట కొందరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని, భక్తులను దూషించారని ఆరోపించారు.అదే విధంగా, స్వామి కళ్యాణం రోజు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, మీడియా ప్రతినిధులు అన్న ప్రసాదం తీసుకోవడానికి వెళ్ళినప్పుడు కూడా పంతుళ్ళు దురుసుగా ప్రవర్తించారని వివరించారు. భక్తి వాతావరణంలో జరుగుతున్న ఉత్సవాల్లో పంతులు ఈ విధంగా ప్రవర్తించడం తగదని, భక్తుల మనో భావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు యూనియన్ సభ్యులు తమ పిర్యాదులో డిమాండ్ చేశారు.

# ‘ది గర్ల్ ఫ్రెండ్’ నాకెంతో సంతృప్తినిచ్చింది



నేషనల్ బ్యూటీ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో.. దీక్షిత్ శెట్టి హీరోగా గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించిన సినిమా “ది గర్ల్ ఫ్రెండ్”. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 14వ తేదీన తెలుగు సహా తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించగా.. అల్లు అరవింద్ రష్మిక, విజయ్ ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను క్యాన్సిల్ చేయడంపై స్పందించిన ఆయన.. తాను నటించిన సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు రష్మికే రానప్పుడు విజయ్ ఏం వస్తాడు? అని అన్నారు. అందుకే ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఇక సినిమాలను నిర్మించడం ద్వారా తాను కోట్లాది రూపాయలు సంపాదించాననడంలో ఎలాంటి దాపరికం లేదన్న అల్లు అరవింద్.. “ది గర్ల్ ఫ్రెండ్” సినిమా ద్వారా మాత్రం తాను సంపాదించాలనుకున్నది సంతృప్తి మాత్రమేనన్నారు. రాహుల్ తనకు ఈ కథను ఎంత ఉద్వేగంతో చెప్పాడో.. అంతే ఉద్వేగంతో తెరకెక్కించాడని తెలిపారు. సినిమాలో పాటలెన్ని?, జోక్స్ ఎన్ని?, ఎంత ఎంటర్టైన్మెంట్ ఉంది? అని చూసే సినిమా కాదన్నారు. మన అక్క, చెల్లి, పిన్ని మనసుల్లో ఏముంటుంది? ఎలాంటి కోరికలుంటాయి? అన్న ఉద్దేశంతో “ది గర్ల్ ఫ్రెండ్” మూవీని చూడాలన్నారు. ఇక ఈ సినిమాకు హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతాన్ని అందించగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ చేశారు.

# ‘చిరంజీవ’ కోసం ఎంతగానో కష్టపడ్డాడు




రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ ‘చిరంజీవ’. ఈ చిత్రంలో కుషిత కల్లపు హీరోయిన్‌గా నటించగా.. స్ట్రీమ్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించగా.. ఈ నెల 7వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ క్రమంలో.. తాజాగా, ఈ సినిమా ప్రెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ – ఆహాతో నాకు మంచి అనుబంధం ఉంది. లాక్ డౌన్ టైమ్‌లో నేను చేసిన ‘ఒరేయ్ బుజ్జి’గా ఆహాలో స్ట్రీమింగ్ అయ్యింది. ఇప్పుడు చిరంజీవ మూవీ ఈ నెల 7న ప్రీమియర్ కాబోతోంది. ఆహా సబ్ స్క్రైబ్ చేసుకుని ఈ సినిమాను చూడాలని కోరుతున్నా. దీని కోసం అందరం కష్టపడతాం. కానీ అభి డైరెక్టర్‌గా మా అందరి కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కష్టపడ్డాడు. మంచి హిట్ దక్కించుకునేందుకు అతను అన్ని విధాలా అర్హుడు. ఈ సినిమాలో నాతో పాటు కిరీటి, సంజయ్ కృష్ణ..ఇలా మంచి కోస్టార్స్ నటించారు. వాళ్లందరితో నటించడాన్ని ఎంజాయ్ చేశాను. అన్నారు. ఆ తర్వాత డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ – “చిరంజీవ మూవీ కాన్సెప్ట్ గురించి అభి చెప్పాడు. చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. అభి నాకు గౌతమ్ ఎస్ ఎస్ సీ సినిమా టైమ్ నుంచి తెలుసు. ఇందులో మంచి రోల్ చేశాడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశాను. ఆ మూవీ తర్వాత మేము మంచి ఫ్రెండ్స్ అయ్యాం. యాక్టర్స్‌ను బాగా ఇమిటేట్ చేస్తుంటాడు. ‘కందిరీగ’ సినిమాకు తెలంగాణ యాసలో డైలాగ్స్ రాసేందుకు అభి హెల్ప్ చేశాడు.

# ‘మిత్ర మండలి’ సినిమా.. స్ట్రీమింగ్ తేదీ ఖరారు



కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ‘మిత్రమండలి’ బాక్సాఫీసు వద్ద పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీపావళి కానుకగా అక్టోబర్ 16న విడుదలై.. హిట్ అందుకోలేకపోయింది. నటుడు ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు విజయేందర్ దర్శకత్వం వహించారు. బ్రహ్మానందం, వెన్నెల కోషోర్, సత్య, విష్ణు, రాగ్ మయూర్ కీలక పాత్రలో నటించగా.. సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై బన్నీ వాసు నిర్మించారు. ఈ సినిమా కేవలం 20 రోజులకే ఓటీటీలోకి రాబోతుండటం విశేషం. తాజాగా, ‘మిత్రమండలి’ డిజిటల్ స్ట్రీమింగ్‌పై నటుడు ప్రియదర్శి అధికారిక ప్రకటన విడుదల చేశాడు. ఈ సినిమా హక్కులను అమెజాన్ ప్రైమ్ సొంతం చేసుకోగా.. నవంబర్ 6 నుంచి స్ట్రీమింగ్ అందుబాటులోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. “మేము నవ్వుకున్నాము.. చాలా నేర్చుకున్నాము.. రీకట్ చేశాం. ‘మిత్రమండలి’ కొత్త వెర్షన్‌ను చూడబోతున్నారు. ఈ సారి మరింత సరదాగా ఉండబోతుంది. డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వనుంది. మరోసారి మీ హృదయాలను దోచేయడానికి సిద్ధంగా ఉంది” అని రాసుకొచ్చారు. ఇక ఈ పోస్ట్ చూసిన సినీ ప్రియులు ఆనందపడుతున్నారు.

# దక్షిణాదిని చూసి నేర్చుకోండి



ఇండస్ట్రీల్లో ఉండే వ్యత్యాసం గురించి ఇప్పటికే ఎంతోమంది హీరోయిన్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. కొందరు టాలీవుడ్‌ను పొగిడితే.. మరికొందరు మాత్రం తమ ఇండస్ట్రీనే గొప్ప అన్నట్లుగా మాట్లాడారు. తాజాగా, బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా త్వరలో ‘జటాధర’ చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబర్ 7న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె కీలక వ్యాఖ్యలు చేసింది. “నేను గతంలో తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత తెలుగు ఆడియన్స్ ముందుకు రాబోతున్నాను. నాకు ఎప్పటినుంచో ప్రాంతీయ సినిమాల్లో చేయాలన్న ఆసక్తి ఉండేది. కానీ వరుస షెడ్యూల్స్, డేట్స్ కుదరకపోవడం వల్ల ఇబ్బందులు రావడంతో చేయలేదు. దక్షిణాది సినీ పరిశ్రమలో నాకు కొన్ని విషయాలు నచ్చాయి. ఇక్కడ సమయపాలన పాటిస్తారు.. బాలీవుడ్ ఈ విషయాన్ని నేర్చుకోవాలి. టాలీవుడ్‌లో తొమ్మిది గంటలకు షూటింగ్‌కు వస్తే సాయంత్రం ఆరు వరకు పూర్తయిపోతుంది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ షూటింగ్ నిర్వహించరు. ఇది చాలా మంచి విషయం ఇలా చేయాలంటే క్రమశిక్షణ అవసరం. కానీ హిందీ పరిశ్రమలో ఇలాంటివి ఉండవు. అర్ధరాత్రి వరకు షూటింగ్స్ జరుగుతుంటాయి.. సమయపాలన అంటూ ఉండదు అది నాకు అస్సలు నచ్చలేదు. ఈ విషయంలో టాలీవుడ్‌ను చూసి హిందీ వాళు ళ మారాలని కోరుకుంటున్నాను” అని చెప్పుకొచ్చింది.

# నెట్ ఫ్లిక్స్ ఇడ్లీలు భలే తింటున్నారు

ధనుష్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటించిన ఇడ్లి కడై తమిళంలో ఓ మోస్తరుగా ఆడింది కానీ తెలుగులో డిజాస్టర్ మూటగట్టుకుంది. ఎమోషనల్ మూవీ కాబట్టి మన ప్రేక్షకులు ఆదరిస్తారనే అంచనా పూర్తిగా తప్పింది. ఒరిజినల్ వెర్షన్ కు డ్యూడ్ తో పోటీ లేకపోయి ఉంటే ఇంకా బెటర్ గా ఆడేదన్న కామెంట్ లో నిజం లేకపోలేదు. ఇటీవలే నాలుగు వారాల థియేటర్ విండో పూర్తి చేసుకుని ఇడ్లి కొట్టు నెట్ ఫ్లిక్స్ లో వచ్చేసింది. వారం తిరక్కుండానే 5 మిలియన్ల వ్యూస్ దాటేసింది. ఇదే ప్లాట్ ఫామ్ లో ఉన్న ఓజి అయిదు మిలియన్లు చేరుకోవడానికి పదకొండు రోజులు పట్టడం గమనించాల్సిన విషయం.యాక్షన్ ఎలిమెంట్స్, కమర్షియల్ హంగులు, ఎలివేషన్లు లేని ఒక పల్లెటూరి సినిమాకు ఇంత స్పందన రావడం అనూహ్యం. ఎందుకయ్యా అంటే భారీ శాతం ఆడియన్స్ దీన్ని థియేటర్లలో చూడలేదు. మిస్సయిన వాళ్ళే ఎక్కువ. అందులోనూ కంప్లీట్ ఫ్యామిలీ జానర్ కాబట్టి ఇంట్లో చూసేందుకు ప్రాధాన్యం ఇచ్చినవాళ్లు ఎక్కువ. దీంతో సహజంగానే వ్యూస్ ఎక్కువగా వచ్చాయి. ఆశ్చర్యం కలిగించే మరో విషయం ఏంటంటే అయిదు దేశాల్లో ఇడ్లి కొట్టు నెంబర్ వన్ స్థానంలో ఉండగా నాన్ ఇంగ్లీష్ మూవీస్ లో ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానంలో ఉంది. పదిహేను దేశాల్లో టాప్ టెన్ లో చోటు దక్కించుకుంది. ఇదంతా చిన్న ఘనత కాదు. ధనుష్ మార్కెట్ పరంగా ఇది చాలా ఉపయోగపడుతుంది. నిర్మాణంలో ఉన్న సినిమాలకు భారీ డిజిటల్ రేట్ పలుకుతుంది. అందులోనూ ఓజిని డామినేట్ చేసే స్థాయి అంటే ఆఫర్లు మరింత పెరుగుతాయి. సెంటిమెంట్ మరీ ఎక్కువైపోయి ల్యాగ్ అనిపించి మన జనాలు ఇడ్లి కొట్టుని వద్దన్నారు కానీ తమిళంలో చెప్పుకోదగ్గ వసూళ్లే వచ్చాయి.



# యూనిక్ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్



విష్ణు విశాల్ నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ‘ఆర్యన్’, ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మించారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే తమిళ్‌లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకుంది. ఈనెల 7న తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో విష్ణు విశాల్ మాట్లాడుతూ, ‘తెలుగు ఆడియన్స్ అందరికీ నా హృదయపూర్వక నమస్కారం. మీరు నా సినిమాలు ‘రాక్షసన్, ఎఫ్ఐఆర్, మట్టి కుస్తీ’ని చాలా ప్రేమతో సపోర్ట్ చేశారు. ఇప్పుడు ఈ సినిమాతో మళ్ళీ మీ ముందుకు వస్తున్నాను. యూనిక్ థ్రిల్లర్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది. ఇలాంటి సినిమా చేయడం చాలా ఛాలెంజింగ్. తప్పకుండా ఆడియన్స్‌కి సీట్ ఎడ్జ్ అనుభవాన్ని ఇస్తుంది. ఈ సినిమా తమిళ్‌లో చాలా అద్భుతమైన విజయాన్ని సాధించింది. తెలుగు ఆడియన్స్‌కి కూడా ఈ సినిమా నచ్చుతుందని కోరుకుంటున్నాను’ అని చెప్పారు.

# సీపీ సజ్జనార్‌కు సింగర్ చిన్మయి ఫిర్యాదు

సోషల్ మీడియాలో తనపై అసభ్య పదజాలం వాడుతూ కామెంట్స్ చేస్తున్నారని టాలీవుడ్ సింగర్ చిన్మయి సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో కొంతమంది ఆకతాయిలు స్పేస్ నిర్వహిస్తూ చిన్మయిపై దారుణమైన కామెంట్లు చేశారు. ఫెమినిస్టులకు పిల్లలు పుట్టకూడదని, పుట్టినే వెంటనే చనిపోవాలని అన్నారు. లేదంటే వాళ్లను సరిగా పెంచరు అంటూ వ్యాఖ్యానించారు. సింగర్ చిన్మయి పేరు ఎత్తుతూ బూతులు తిట్టారు. దీంతో చిన్మయి ఎక్స్ వేదికగా సీపీ సజ్జనార్ కు ఫిర్యాదు చేశారు. తన పిల్లలు చనిపోవాలని కోరుకుంటున్నారని, దయచేసి గమనించాలని కోరారు. ఇలాంటి వాళ్ల వేధింపులతో విసిగిపోయానని తెలిపారు. వాళ్లకు ఏదైనా అభిప్రాయం నచ్చకపోతే వదిలేయాలని అన్నారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నానని 15ఏళ్లైనా సరే చట్టం తన పని తాను చేసుకోనివ్వాలని ట్వీట్ లో పేర్కొన్నారు. దీంతో చిన్నయి ట్వీట్ కు సజ్జనార్ స్పందించారు. సైబర్ క్రైం పోలీసులు, హైదరాబాద్ పోలీసులను విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో చిన్మయి సజ్జనార్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# అచ్చమ్మకు నివాళులర్పించిన బీఆర్ఎస్ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి..



తల్లాడ, నవంబర్ 6 (ప్రశ్నన్యూస్): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు రెడ్డెం అచ్చమ్మ ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. గురువారం ఆమె దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె కుమారులు రెడ్డెం రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డిని పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు జి.వి.ఆర్, నాయకులు పెరిక నాగేశ్వరరావు చిన్నబ్బాయి, కేతినేని చలపతిరావు, సొసైటీ డైరెక్టర్ దగ్గుల రాజశేఖర్ రెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వ్యవసాయం నుండి వెళ్లిపోయేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది,

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి సుదర్శన్ రావు.**




తల్లాడ, నవంబర్ 6 (ప్రశ్నన్యూస్): మండల పరిధిలో వాసవి కళ్యాణమండపంలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు అధ్యక్షతన సత్తుపల్లి డివిజన్ మహాసభ గురువారం నిర్వహించారు మాట్లాడుతూ, రైతులను వ్యవసాయం నుండి దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు, అమెరికా నుండి పత్తి గోధుమపాలు కోడిపంది మాంసాలు దిగుమతి అనుమతిస్తూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వదేశీ వ్యవసాయానికి మంగళం పాడుతుందని ఆరోపించారు, రైతుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు కేంద్ర ప్రభుత్వ విధానాలు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసిఐ నిబంధనలు పత్తి రైతులను దోస పెడుతున్నాయన్నారు ఎకరానికి ఏడుపుంతాల పరిమితి ఎనిమిదిలో ప్రేమ శాతం కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ పత్తి రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నాయని పత్తి కొనుగోలు నిరాకరణకై ప్రభుత్వం తీసుకొచ్చిన కఠిన నిబంధనలు ఎత్తివేసి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్కు 8110 రూపాయలు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాలతో పత్తి నాణ్యత దెబ్బతిన్నదని, ఒకవైపు దిగుబడి తగ్గి రైతు లబోదివో అంటుంటే సిసిఐ నిబంధనలు మద్దతు ధరలు లేకుండా పోయాయి అన్నారు అన్ని నిబంధనలు ఎత్తివేసి మద్దతు ధరకు ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా కౌలు రైతులు సాగులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని వారికి అవసరమైన సబ్సిడీలు బ్యాంకు రుణాలు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం భూభారతలో భాగంగా అందజేయాల డిమాండ్ చేశారు పంటల ప్రణాళికల రూపొందించి అమలు చేయాలని కోరారు, సమస్యల పరిష్కారం కోసం రైతులు సంఘటితంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు, కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు తాత భాస్కరరావు, శీలం సత్యనారాయణ రెడ్డి, శీలం పకీరమ్మ, అయినాల రామలింగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు .

# బైక్ ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు. వ్యక్తికి గాయాలు..!



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) నవంబర్ 06: భద్రాద్రికొత్తగూడెంజిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం వెళ్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం గాయలైన వ్యక్తిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి వుంది.

# జర్నలిస్టు కుటుంబానికి ప్రొఫెసర్ ప్రసన్న హరి కృష్ణ పరామర్శ - ప్రగాఢ సంతాపం



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా కేంద్రం, సీతారాంపూర్‌లో నివసిస్తున్న జర్నలిస్టు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆతికం రాజశేఖర్ గౌడ్ కుటుంబాన్ని కంటెస్టేడ్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ప్రొఫెసర్ ప్రసన్న హరి కృష్ణ పరామర్శించి,దివంగత అతికం రాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇటీవల రాజశేఖర్ గౌడ్ తండ్రి మృతిచెందిన నేపథ్యంలో రాజశేఖర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసన్న హరి కృష్ణ మాట్లాడుతూ "జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ సమాజానికి సేవ చేస్తారు. ఆతికం రాజశేఖర్ గౌడ్ కూడా ఆ బాధ్యతాయుతమైన వృత్తిలో విశ్వసనీయతతో పనిచేస్తున్నారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్, ప్రవీణ్ రాజ్, రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణాలు ప్రమాదాలు

# ప్రభుత్వాలే కాదు ప్రజలు కూడా మారలి




మొన్న కర్నూలు నేడు చేవేళ్లా దారులు వేరైన.. ప్రమాదాలు వేరైనా జరిగిన కారణం ఒకటే ప్రయాణం. నేటి కాలంలో ప్రయాణాలు ప్రమాదాలుగా మారుతున్నాయి. దు:ఖాలకు దారితీస్తున్నాయి. తప్పేవరితో ఒప్పేరిదో చిన్నపెద్ద తేడా లేకుండా ప్రణాలు పోతున్నాయి. అవకాశం ఉన్నవారు దేవుడే దిక్కని తెగించి ముందుకు సాగి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్నారు. వారు చేసిన తెగింపుకు గుర్తుగా నేడు సాక్షులుగా మారారు. బిక్కు బిక్కుమంటూ.. వెలవెల బోయిన వారిని వారు చూశారు. తోటి వారిని పోగొట్టుకుని, కన్నవారిని పోగొట్టుకుని కన్నీరు మున్నీరైన వారిని వారు చూశారు. దేవుడా కాపాడమని కోరుకున్న వారి పిలుపు వాళ్ల చెవిలో ఇప్పటికీ మారుమ్రోగుతున్నాయి. ఎన్నో కలలతో ఏదో సాధించాలని కొందరూ.. చుట్టలను కలవాలని కొందరూ.. పెళ్లి అనే బంధంతో కొత్త జీవితంలోకి అడుగు పెట్టేవారు కొందరూ.. చదువి ఏదో సాధించి తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలనే ఆశలతో కొందరూ బస్సు అనే చావులోకి అడుగు పెట్టారు. అది గొయ్యని తెలియక. ప్రయాణం అనుకున్నారు. ప్రమాదం అనుకోలేదు. ప్రాణాలు పోతాయని అస్సలు అనుకోలేదు. అయినా వారిని కలవడానికి కొందరూ, అయినా వారితో సెలవు కోరి కొందరూ ఈ యమగండంలోకి అడుగు పెట్టారు. రేపటికై కలలు కంటూ కనిపించని లోకాలకు వెళ్లిపోయారు. కాపాడే వాడు కనరాక కన్నీళ్లతో మూసుకుపోతున్నాయి ఆ కళ్లు. మరి జన్మకైన కరుణిస్తాడేమో దేవుడు. చావును ఎవరైనా చూశారా అంటే సాక్షులుగా మేమున్నామంటున్నారు శవాలుగా మారి. తప్పేవరిదో ఒప్పేవరిదో.. ప్రాణాలు పోగట్టుకున్నది మాత్రం అభాగ్యులు. కొండంత ఆశతో అమ్మా నాన్నలతో కలిసి కలిసి బస్సేక్కిన చిన్నారు. రేపటికీ నేనున్నని ధైర్యం చెప్పిన కూతుళ్లు.. కలిసి అడుగు వేసే తోడుకై ఏదురుచూస్తు పెళ్లి కూతుళ్లు.. ఇలా ఎందరో మంటల్లో కాలి.. రహాదారిలో బుడిదయ్యారు. ఇలా ఎందరో కంకర్లో చిక్కుకుని చనిపోయారు. వారి రక్తం రోడ్డుపై ఏరులై పారుతుంది.

ప్రయాణాలంటే సంతోషాలు, సంతోషాలంటే ప్రయాణాలు. అలాంటిది ఈ మధ్య కాలంలో ప్రయాణాలు ప్రమాదాలకు దు:ఖాలకు మారు పేరుగా మారాయి. సంతోషాలు హహాకారాలుగా మారుతున్నాయి. రహాదారుల్లో రక్తమై... మనుషులు మంటల్లో బూడిదై పోతున్నారు. ఎన్నో కలలతో చేసే ఈ ప్రయాణాలు మధ్యలోనే అంతరించి పోతున్నాయి. గమ్య స్థలం చేరుకోక ముందే గడిబిడిలు మొదలవుతున్నాయి. ప్రయాణాల కోసం బయల్దేరుతున్న వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీస్తున్నారు. కాపాడే నాధుడు లేక కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబాలు చిన్నాబిన్నమౌతున్నాయి. కొందరు అనాధలవుతున్నారు. మరి కొందరు ఒంటరి వారైపోతున్నారు.

## ప్రజలు ఏం చేయాలి?

ప్రయాణాల విషయంలో ప్రభుత్వాలే కాదు ప్రజలు కూడా మారలి. ప్రయాణాల సమయంలో ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడుపరాదు. అతి వేగంతో ప్రయాణం చేయకుడదు. నాకైం కాదు అనేది నమ్మకమై అయినా అవతలి వారికి ఏం కాకుడదు అనే ఆలోచనే భయం ఉండాలి. నేనే కాదు నాతో పాటు రోడ్డుపై ప్రయాణం చేసేవారందరూ క్షేమంగా ఇంటికి వెళ్లాలని కోరుకుని డ్రైవింగ్? చేయాలి. ఇష్టం వచ్చినట్టుగా వాహనాలను నడుప కూడదు. ప్రయాణాల సమయంలో రోడ్డుపై దృష్టి పెట్టాలి. ఎవేవో ఆలోచనలతో డ్రైవింగ్? చేయకూడదు. లేసీ డ్రవింగ్? అస్సలు చేయకూడదు.

## ప్రభుత్వాలు ఏం చేయాలి..

ప్రభుత్వాలు ఖచ్చితమైన నియమనిబంధనలు పాటించని వారిని కఠినంగా శిక్షించాలి. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలి. ప్రజలకు నిరంతరం ట్రాఫీక్? రూల్స్ తెలియజేయాలి. రూల్స్ పాటించని వారిని కఠినాతి కఠినంగా శిక్షించాలి. ప్రైవేటు వాహనాలపై దృష్టి సారించాలి. ప్రతి నెలకి ఓ సారి ప్రవైటు వాహనాలను తనిఖీ చేయాలి. ఆర్టీసీ బస్సులను పెంచాలి. బస్సు డ్రైవర్లకు నిరంతరం శిక్షణ ఇప్పించాలి. ప్రతి నెలకి ఆర్టీసి డ్రైవర్లకు వారి బాధ్యతల గురించి తెలియజేయాలి. డ్రైవర్? అంటే కేవలం బస్సు నడిపే వాడు కాదు. కొందరి ప్రాణాలను కాపాడే రక్షక బటుడని వారికి తెలియజేయాలి. ప్రమాదాలను త్వరగా గుర్తించే ఏర్పాట్లు చేయాలి. ప్రమాద స్థలానికి వెంటనే వెళ్లాలి. ప్రమాదంలో రక్షకులుగా పని చేసిన వారిని పారితోషికంతో సంతోష పర్చాలి. వారి త్యాగాని గుర్తు చేయాలి దీని ద్వార యువత ప్రమాద సమయంలో సహాయం చేయడానికి ముందుంటుంది. యువతలో చైతన్యం తెచ్చే కార్యక్రమాలను పాఠశాలల్లో, కళాశాలల్లో ఏర్పాటు చేయాలి.



**కవిరత్న అమీనా కలందర్? సీనియర్? జర్నలిస్టు**

# కష్టాల్లో పంచాయతీ కార్యదర్శులు..!!

**- ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలన నెట్టుకొస్తున్న వైనం.**

**- పట్టింపులేని పంచాయతీ ప్రత్యేక అధికారులు..**




జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) నవంబర్ 06: గ్రామ కార్యదర్శులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమయానికి నిధులు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బుల్లేక పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. మరోవైపు నిధుల



గండం అభివృద్ధికి ఆటంకంగా మారింది. విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## - సకాలంలో నిధులు రాక కార్యదర్శుల ఇబ్బందులు..!

గ్రామంలో ఏ పని కావాలన్నా సర్పంచులు వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. సర్పంచుల తర్వాత భారం పంచాయతీ కార్య దర్శులపై పడింది. మండలం లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ. లక్షలలో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులో నుంచి వెచ్చిస్తు న్నారు. ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి కోసం మోటార్లు వంటి పనులకు కార్య దర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఈ విషయం ఉన్నతాది, కారులకు కూడా తెలుసు, ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్న నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడం తో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

## - పట్టింపులేని ప్రత్యేకాధికారులు..!!

పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యాయని తర్వాత గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. వీరు అప్పటికే వారి పనులు, బాధ్యతలో తీరిక లేకుండా ఉంటున్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు పంచాయతీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల అవుతాయి. జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా గ్రామాలకు విడుదల చేస్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగుసార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. ఇక రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. నిధులు సక్రమంగా రాకపోవడం తో అప్పటి పంచాయతీ పాలకవర్గాలే సొంతంగా జేబు నుంచి ఖర్చు చేశారు. అప్పట్లో కొందరు సర్పంచులు అప్పులు కూడా చేశారు.

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణకు సాధారణ నిధుల నుండి ఖర్చు చేయాల్సి వస్తున్నా. చాలా గ్రామాల్లో ఇవి సరిపోక కార్మికులకు వేతనాలే ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి.

## - గ్రామ కార్యదర్శులపై భారం..!!

సర్పంచులు, పాలకవర్గాల బాధ్యతలు ముగిసి ఏడాది గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో, గ్రామంలోని పని భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ. లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్న నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతో ఆర్థిక భారం తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు.

# లంచాలు తీసుకున్నారా.?

# అందుకే చర్యలు తీసుకోరా.? కృష్ణారెడ్డి

## అనుమతులు రీవోక్ చేయకుండా కాలక్షేపం ఎందుకు.?

- అక్రమ మార్గంలో అనుమతులు ఇచ్చి మౌనం వహిస్తున్న వైనం
- జోనల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న స్థానికులు





జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్


కృష్ణారెడ్డి

**నాచారం (ప్రశ్న న్యూస్)** ప్రస్తుత కాలంలో ప్రభుత్వ అధికారులు అవినీతి చేయడం చాలా సహజంగా మారింది. వాళ్ళ అవినీతి బయటపడ్డ భయం అనేది లేకుండా పోయింది. ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవడం ఎప్పుడో మానేశారు దానితో అవినీతి అంటే "టీ" తాగినంత సులువుగా చేసేస్తున్నారు ప్రభుత్వ అధికారులు. ఇక జిహెచ్ఎంసి పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి అంతం లేదు. వాళ్ళు చేసే అవినీతి అంతా ఇంతా కాదు ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ పూర్తిగా అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. పాలకులు అలాగే ఉన్నారు అధికారులు అంతకంటే ఎక్కువ ఉన్నారు అవినీతిని చేయడంలో, ప్రోత్సహించడంలో అంటు నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం పరిధిలో జోనల్ సిపి పర్యవేక్షణలో అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారని చివరికి నకిలీ పత్రాలను సృష్టించిన, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లంచాలు తీసుకొని హ్యాపీగా అనుమతులు ఇచ్చేస్తున్నారని తరువాత ప్రజలు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేస్తే దానిని కప్పిపుచ్చుకోవడానికి అక్రమ నిర్మాణదారునికి కోర్టుకు వెళ్ళమని సలహాలు ఇస్తూ వెళ్ళిన తర్వాత కోర్టులో కేసు ఉంది మేమేం చేయాలంటూ న్యాయం చేయకుండా లంచాలు తీసుకున్న వాళ్లకే అండగా నిలుస్తూ ఉండడం ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో సహజంగా మారింది. అందులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గం లోని నాచారం డివిజన్ లో వెస్లీ స్కూల్ వద్ద అన్నపూర్ణ కాలనీ సర్వే నంబర్ 106, 107 లో వెంచర్ లో ఎల్బీనగర్ జోనల్ టౌన్ ప్లానింగ్ సిపి లంచాలకు అమ్ముడుపోయి అక్రమ మార్గంలో అనుమతులు ఇచ్చారని స్థానిక నేత కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. దానితో ఆగమేఘాల మీద అధికారులు చేసిన తప్పును తెలుసుకొని రీవోక్ నోటీసు ఇచ్చారు. కానీ కావాలని రీవోక్ చెయ్యకపోవడం వెనక రాజకీయ వత్తిడి ఉందన్నది బహిరంగ రహస్యమే.

### వెంచర్ చేసే సమయంలో అతి ఉత్సాహం ప్రదర్శన

వెంచర్ చేసే సమయంలో ప్రజల సౌకర్యాల కోసం దాదాపు720 గజాల ఖాళీ స్థలం వదిలినట్లు చూపారు. దానితో అక్కడ కొనుగోలు చేసిన ప్లాట్ల ఓనర్లు దానిని పార్క్ స్థలంగా వదిలివేస్తామని లేదా కమ్యూనిటీ హాల్ కట్టిస్తామని ఇతర అవసరాల కోసం వదిలి వేసామని చెప్పడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం భూముల ధరలు అధికంగా పెరగడంతో కొంతమంది అక్రమార్కులు ఇక డబ్బే లక్ష్యంగా నకిలీ పత్రాలు సృష్టించి అక్రమ మార్గంలో అనుమతులు తీసుకువచ్చి అపార్ట్మెంట్ నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వివాదం బిల్డర్ కు బస్తీ వాసులకు మధ్య
అంతర్ యుద్ధం జరుగుతోంది అయితే బిల్డర్ కు ప్రజాప్రతినిధుల, అధికారుల అండ ఉండడంతో కాలనీవాసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా వాళ్ల ప్రయత్నాలు వృధాగానే మారుతున్నాయని కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో నీతి నిజాయితీ కంటే అవినీతి అక్రమాలకు, డబ్బులకే ప్రాధాన్యత ఉందని నాచారం డివిజన్ లో దీని ప్రభావం అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక సాక్షాత్ ప్రజాప్రతినిధులే ఉండడంతో ఇక అధికారులు కూడా కాలనీ వాసులకు చుక్కలు చూపిస్తున్నారని జోనల్ కమిషనర్ అసలు కలవడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అక్రమాలకు సహకరిస్తున్న జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్

గతంలో ఈ ఖాళీ స్థలాన్ని చదును చేసే సమయంలో బస్తీ వాసులు అడ్డుకొని రెవిన్యూ అధికారులకు, జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దానిని పూర్తిగా పరిశీలించిన అధికారులు పనులు ఆపివేసి నిర్మించిన గోడలను సైతం కూల్చి వేశారు. జిహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ టౌన్ ప్లానింగ్ సిపి శ్రీనివాస్ యాదవ్ ప్రస్తుత స్థలం యజమాని పరుశురాం యాదవ్ ది కావడంతో ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి జోనల్ సిపి ఈ అక్రమానికి ఒడికట్టాడని గతంలో మల్కాజిగిరి టౌన్ ప్లానింగ్ ఏసీపీగా విధులు నిర్వహించిన సమయంలో కూడా భారీగా అవినీతి ఆక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. జిహెచ్ఎంసిలో అవినీతి అధికారులదే రాజ్యం ఉంది, వాళ్ళు చెప్పిందే వేదం ఎందుకంటే ఉన్నత అధికారులకు కూడా నెల నెల మామూళ్లు పంపిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే టౌన్ ప్లానింగ్ ఏసీపీలు చేసినంత అవినీతి బహుశా జిహెచ్ఎంసిలో ఏ విభాగంలో ఉండదన్న విమర్శలు లేకపోలేదు. దీనితో జోనల్ సిపి అవినీతికి పాల్పడి అక్రమ మార్గంలో అనుమతులు ఇచ్చారని స్థానికుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత వాటిని రీవోక్ చేయడానికి షో కాజ్ నోటీసులు సైతం అందించారు. కానీ లంచాలు తీసుకున్న విశ్వాసానికి రీవోక్ చేయకుండా వదిలేసారని కృష్ణారెడ్డి ఆరోపించారు.

### ఇండస్ట్రియల్ బఫర్ జోన్ లో అనుమతులా.?

ఇక మున్సిపల్ శాఖలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి ఎట్లుంది అంటే డబ్బులు కనిపిస్తే చాలు కండ్లు మూసుకొని అనుమతులు ఇచ్చేస్తారు. అది ఏదైనా పర్లేదు తర్వాత విషయం బయటపడితే తీసుకున్న లంచాలో ఉన్నత అధికారులకు వాటాలు ఇస్తారు దానితో సమస్య వెలుగులోకి రాదు ఎంత మంది ఫిర్యాదులు చేసిన, పత్రికల్లో కథనాలు వచ్చిన అస్సలు చర్యలు తీసుకోరు, అక్రమాలు చేసే వాళ్ళ దగ్గర లంచాలు తీసుకున్నారు కదా ఇక చర్యలు ఎందుకు తీసుకుంటారు అంటూ స్థానిక నేత కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాచారం పారిశ్రామిక బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని గతంలో అధికారులు దానిని పూర్తిస్థాయిలో పరిశీలించక నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారంటే ఎంత భారీ స్థాయిలో అమ్ముడుపోయారో అర్థం చేసుకోవచ్చని కృష్ణారెడ్డి మండిపడ్డారు. పార్కులను కబ్జా చేసి అధికారులకు లంచాలు ఎరచూపి అక్రమ మార్గంలో అనుమతులు తీసుకు తీసుకువచ్చారని స్థలమును ఓపెన్ ల్యాండ్ గా చూపించడంతో దానిని పార్కుగా చేయాలని, కమ్యూనిటీ హాల్ లేదా ఇతర అవసరాల కోసం ఖాళీ స్థలం వదిలి పెట్టేవారు గ్రామపంచాయతీ లేఅవుట్లలో, దానిని తరువాత వెంచర్ చేసిన వ్యక్తులు ప్లాట్లుగా చేసి అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఇలా గ్రామపంచాయతీ లేఅవుట్ ముసుగులో భారీగా అవినీతి అక్రమాలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### రీవోక్ చేయకుండా కాలక్షేపం ఎందుకు.?

జోనల్ కమిషనర్, జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని రీవోక్ చేయకుండా కాలక్షేపం చేస్తూ అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి కోర్టు స్టే తీసుకొచ్చుకోవడానికి కావాలని సమయం కేటాయించారని దీని వెనుక భారీగా అవినీతి జరిగిందని స్థానికులు కృష్ణారెడ్డి ఆరోపించారు. జోనల్ సిపి శ్రీనివాస్ యాదవ్ కావాలని నిర్లక్ష్యం వహిస్తున్నారని కోర్టు స్టే ఉన్న కూడా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ అనుమతులను రద్దు చేయకుండా ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన వ్యవసాయ విస్తరణాధికారి

- రైతు కుటుంబం నుంచి
రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రైతు కుటుంబం నుంచి రూ. 10,000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఒక అధికారి అడ్డంగా దొరికిపోయాడు.
మహబూబాబాద్ జిల్లాలోని మర్రిపెడ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారి జీ. సందీప్ ఏసీబీకి పట్టుబడ్డాడు. జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబం ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తన రైతు బీమా పరిహార దస్తావేజును ప్రాసెస్ చేసి, దానిని ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించడానికి రూ. 10,000 లంచం అడిగాడని ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుని నుంచి రూ. 10,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏ ప్రభుత్వ సేవకుడైనా లంచం అడిగినట్లయితే అవినీతి నిరోధక శాఖకు తెలియజేయాలని ఏసీబీ ప్రజలకు సూచించింది. అవినీతి నిరోధక శాఖ కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునని తెలిపింది. అంతేకాకుండా సామాజిక మాధ్యమాలైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్, వెబ్‌సైట్ ద్వారా కూడా ఏసీబీ అధికారులకు సమాచారం అందించవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ హామీ ఇచ్చింది.

# ఏసీబీకి చిక్కిన పౌరసరఫరాల కార్యాలయ మేనేజర్, పీఏ అరెస్టు

- బియ్యాన్ని తరలించడానికి
రూ.75 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని గోదాము నుండి ఆసిఫాబాద్‌లోని పౌర సరఫరాల గోదాముకు తరలించడానికి అనుమతి ఇవ్వడానికి రూ. 75,000 లంచం తీసుకుంటున్న పౌర సరఫరాల అధికారిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా పౌర సరఫరాల కార్యాలయ మేనేజర్ గురుబెల్లి వెంకటనర్సింహారావు, పీఏ (పొరుగు సేవల ఉద్యోగి) కొత్తగొల్ల మణికాంత్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని తన గోదాము నుండి ఆసిఫాబాద్‌లోని పౌర సరఫరాల గోదాముకు తరలించేందుకు అధికారులు తన నుండి రూ. 75,000 లంచం డిమాండ్ చేస్తున్నారని బాధితుడు ఒకరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు వ్యూహం పన్ని వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏ ప్రభుత్వ సేవకుడైనా లంచం అడిగినట్లయితే అవినీతి నిరోధక శాఖకు తెలియజేయాలని ఏసీబీ ప్రజలకు సూచించింది. అవినీతి నిరోధక శాఖ కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునని తెలిపింది. అంతేకాకుండా సామాజిక మాధ్యమాలైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, ఎక్స్, వెబ్‌సైట్ ద్వారా కూడా ఏసీబీ అధికారులకు సమాచారం అందించవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ హామీ ఇచ్చింది.

# మిగతావన్నీ 'ధోకా' అని ఎలా అంటారు?

- పతంజలి యాడ్‌పై ఢిల్లీ హైకోర్టు సీరియస్




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ యోగా గురు రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. తమ చ్యవన్‌ప్రాశ్ మాత్రమే అసలైనదని, మార్కెట్‌లోని ఇతర కంపెనీల ఉత్పత్తులన్నీ 'ధోకా' (మోసం) అని ప్రచారం చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రముఖ ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ డాబర్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పతంజలి ప్రకటనపై డాబర్ ఇండియా మధ్యంతర ఉత్తర్వులు కోరగా, జస్టిస్ తేజస్ కరియా ఈ కేసును విచారించారు. "మీరు మీ ఉత్పత్తి ఉత్తమమైనదని చెప్పుకోవచ్చు. కానీ, ఇతరులందరినీ మోసగాళ్లు అని ఎలా అంటారు? 'ధోకా' అనేది చాలా ప్రతికూలమైన, అవమానకరమైన పదం. ప్రజలు మోసపూరితమైన పదార్థాన్ని తింటున్నారని మీరు చెప్పినట్లు అవుతుంది. నిఘంటువులో 'ధోకా' కాకుండా వాడటానికి మరో పదం లేదా?" అని పతంజలిని న్యాయమూర్తి సూటిగా ప్రశ్నించారు.డాబర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సందీప్ సేథి, పతంజలి ప్రకటన అన్ని చ్యవన్‌ప్రాశ్ బ్రాండ్లను కించపరిచేలా ఉందని ఆరోపించారు. "ఒక యోగా గురు నుంచి ఇలాంటి మాటలు రావడం మరింత తీవ్రమైన విషయం. ఎందుకంటే ప్రజలు ఆయన మాటల్లో నిజాయితీ ఉంటుందని నమ్ముతారు. మాది 100 ఏళ్ల చరిత్ర ఉన్న సంస్థ. మార్కెట్‌లో 61 శాతం వాటా ఉంది. ఈ ప్రకటన కేవలం ఐదు రోజుల్లో 9 కోట్ల వ్యూస్ సంపాదించింది. ఇది ప్రజల్లో అనవసర ఆందోళన కలిగిస్తోంది" అని కోర్టుకు వివరించారు. పతంజలి తరఫున సీనియర్ న్యాయవాది రాజీవ్ నయ్యర్ వాదిస్తూ తమ ప్రకటన కేవలం అతిశయోక్తి మాత్రమేనని, చట్టప్రకారం ఇది అనుమతించదగినదేనని తెలిపారు. "మేము ఇతరుల ఉత్పత్తులు పనిచేయవని చెప్పడం లేదు. మాది అన్నింటికంటే ఉత్తమమైనదని చెప్పడమే మా ఉద్దేశం. డాబర్ ఈ విషయంలో అనవసరంగా అతిగా స్పందిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. తమ చ్యవన్‌ప్రాశ్‌లో "51 ఆయుర్వేద మూలికలు, కుంకుమపువ్వు" ఉన్నాయని పతంజలి తప్పుడు ప్రచారం చేస్తోందని, ఇది 2014 ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని కూడా డాబర్ తన పిటిషన్‌లో ఆరోపించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

# ఉపఎన్నిక తెచ్చిన గండం, ఎవరి మంత్రి ఊడుతుందో ఏంటో.?

- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాత కేబినెట్ విస్తరణ.?
- కొండా సురేఖ సహా ఆ ముగ్గురు అవుట్.?
- విజయశాంతి సహా ముగ్గురు ఇన్.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ముందు మంత్రిగా అజారుద్దీన్‌ను క్యాబినెట్‌లో తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ ఎన్నిక తర్వాత మంత్రివర్గ మార్పులు చేయనున్నట్లు విస్తృతంగా ప్రచారం సాగుతోంది. అయితే, ఈ వార్తా కథనాలను కాంగ్రెస్ పార్టీ ఖండించడం లేదు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కొంత వెనుకబడిందని హస్తం నేతలు అంతర్గతంగానే చర్చించుకుంటున్నారు. అయితే, ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అనుకున్న విధంగా ఫలితాలు రాకపోతే మాత్రం సీఎం రేవంత్ రెడ్డి కొద్ది మంది మంత్రులకు క్యాబినెట్ నుంచి ఉద్వాసన పలికే అవకాశాలున్నాయన్న చర్చ సాగుతోంది.

### క్యాబినెట్ ప్రక్షాళనకు కారణాలు ఇవేనా.?

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావొస్తోంది. కానీ, అనుకున్న రీతిలో ప్రజల్లో ప్రభుత్వానికి మంచి పేరు రాలేదన్న అసంతృప్తిలో కాంగ్రెస్ హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.?

ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత ఫ్రీ బస్, రైతులకు పెంచిన ఆర్థిక సాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటివి అందిస్తున్నా ప్రజల్లో అనుకున్నంత పాజిటీవ్ వేవ్ పార్టీకి లేదని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మరోవైపు ఆరు గ్యారంటీల్లో ఇతర పథకాలు ఇంకా పట్టాలు ఎక్కలేదు. వీటిపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది. వీటిని ప్రతిపక్షాలు ప్రతీ వేదికపై చెబుతూ ప్రజల్లోకి వెళుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొందరు మంత్రుల పనితీరుపైన పార్టీ హైకమాండ్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు మంత్రులు పార్టీ లైన్ దాటి మితిమీరిన స్వాతంత్రంతో చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్నాయన్న భావనలోనూ హైకమాండ్ ఉంది.

### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాతే ఎందుకు.?

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కూడా కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితం వచ్చేలా లేదన్న భావంతో పార్టీ హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. పార్టీ అంతర్గత సర్వేలు కూడా ఆశించిన రీతిలో లేవని హస్తం నేతలు చెబుతున్నారు. అటు మైనార్టీ వర్గాలను మచ్చిక చేసుకునేందుకు ఎం.ఐ.ఎం.తో దోస్తీ, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం వంటి చర్యలు చేపట్టినా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనే ముందంజలో ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. వారే కాకుండా బయటి సర్వేలు కూడా ఇదే అంశాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. అయినా సీఎం రేవంత్ రెడ్డి తన శక్తివంచన లేకుండా పార్టీని గెలిపించేందుకు ప్రచారంలోకి దిగినప్పటికీ, ఏం జరుగుతుందో అన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అయితే, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఓటమి పాలైతే, అది పార్టీ పైన తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ హైకమాండ్ అంచనా వేస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపైన ఆ ప్రభావం ఉంటుందని విశ్లేషిస్తోంది. ఇదే జరిగితే పార్టీని రెండో సారి అధికారంలోకి తేవడం అంత సులువు కాదన్న విషయాన్ని పసిగట్టిన పార్టీ పెద్దలు క్యాబినెట్ ప్రక్షాళన చేయడం మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. క్యాబినెట్ మార్పుల ద్వారా ప్రజల అసంతృప్తిని కొంచెం తగ్గించడమో, డైవర్ట్ చేయడమో చేయవచ్చన్న వ్యూహంతో పార్టీ పెద్దలు ఉన్నట్లు కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు.

### ఎవరిపై వేటు? ఎవరికి అవకాశం?

అయితే ప్రస్తుతం ఎవరికి అవకాశం ఇస్తారు, ఎవరికి క్యాబినెట్ నుంచి ఉద్వాసన చెబుతారన్న దానిపై పూర్తి స్పష్టత లేకున్నా, పార్టీలో మాత్రం కొందరి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను తప్పించి, ఆమె స్థానంలో విజయశాంతికి అవకాశం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పీసీసీ చీఫ్‌గా నియమించి, ప్రస్తుత చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. సీఎంతో నేరుగా తలపడిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఉద్వాసన తప్పదన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో సాగుతోంది. ఆయన స్థానంలో మరో బలమైన సామాజిక వర్గం నుంచి అవకాశం ఇస్తారని చెబుతున్నారు. మల్ రెడ్డి రంగారెడ్డికి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది. ఇక కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి ఆయన స్థానంలో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వవచ్చన్న చర్చ నడుస్తోంది. గత కొంత కాలంగా రాజగోపాల్ రెడ్డి పార్టీపై అసంతృప్తి వెళ్లగక్కుతున్న విషయం తెలిసిందే. తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, మాట నిలబెట్టుకోలేదని విమర్శలు చేస్తున్నారు. ఈ టైంలో కుటుంబానికి ఒకే పదవి' అన్న పార్టీ లైన్ ప్రకారం కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి ఆయన సోదరుడు రాజ్ గోపాల్ రెడ్డికి అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588